




VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 114 | శుక్రవారం 25 సెప్టెంబర్ 2026 | పేజీలు : 8 | వెల : 2/-


## ట్రంప్-జిన్‌పింగ్ భేటీకి ముందే కీలక డీల్..

## అమెరికా-చైనా వాణిజ్య సంధి పొడిగింపు!



వార్త సాక్ష్యం : అమెరికా-చైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఇరు దేశాల మధ్య కుదిరిన వాణిజ్య సంధిని మరో రెండు నెలలు పొడిగించేందుకు అంగీకారం కుదిరింది. దీంతో గతంలో కుదిరిన ఒప్పందం జనవరి 10 వరకు కొనసాగనుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భేటీకి ముందే ఈ నిర్ణయం వెలువడింది. - మిగతా2లో

## అభివృద్ధి ఒక మానవ హక్కు..

## సమ్మిళిత అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- అభివృద్ధి హక్కు పై ఐరాసలో భారత్ కీలక ప్రకటన
- సమ్మిళిత అభివృద్ధి, అంతర్జాతీయ సహకారానికి కట్టుబడి ఉన్నామని వెల్లడి
- ప్రపంచ పురోగతిలో అసమానతలు ఉన్నాయని అంగీకరించిన ఐక్యరాజ్యసమితి
- అభివృద్ధి హక్కు ప్రకటన 40వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక సమావేశం

2



## నవంబర్‌లో విశాఖ సదస్సు..

## దేశ, విదేశాల్లో ఏపీ ప్రభుత్వ రోడ్‌షోలు..

విశాఖలో జరగనున్న భాగస్వామ్య సదస్సు-2026 పై సీఎం చంద్రబాబు సమీక్ష

సదస్సుకు ముందు 5 ప్రాంతాల్లో రీజనల్ కాన్ఫరెన్సులు నిర్వహించాలని ఆదేశం

ఎంఎస్ఎంఈలకు ప్రాధాన్యతనిస్తూ 30 నియోజకవర్గాల్లో పార్కులకు శంకుస్థాపన

పాత ఎంఓయూలను వేగంగా కార్యరూపం దాల్చాలని అధికారులకు సీఎం నిర్దేశం

సదస్సు ప్రచారానికి దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో భారీగా రోడ్‌షోల నిర్వహణ



2

## సుప్రీంకోర్టులో దానం పిటిషన్ తిరస్కరణ..

## ఇక ఖైరతాబాద్‌లో ఉప ఎన్నికే!

- దానం నాగేందర్ అనర్హత వేటును సమర్థించిన సుప్రీంకోర్టు
- ఉప ఎన్నికలో పోటీ చేసుకోవాలని సూచన
- పదవితో పాటు పార్టీ మారితే ఫిరాయింపేనని స్పష్టీకరణ
- తీర్పు నేపథ్యంలో సీఎం నివాసానికి వెళ్లిన దానం
- సుప్రీం తీర్పు పట్ల బీఆర్ఎస్, బీజేపీ హర్షం



2

## క్షుద్ర పూజలు చేశానంటూ తప్పుడు ప్రచారం



వార్త సాక్ష్యం: క్షుద్ర పూజలు చేశానని కాంగ్రెస్ పార్టీ నేతలు తన పై తప్పుడు ప్రచారం చేశారని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ పై అన్ని సాక్ష్యాధారాలతో కేసు ఫైల్ చేశానని చెప్పారు. - మిగతా2లో

## గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్‌తో నారా లోకేశ్ భేటీ..



వార్త సాక్ష్యం: ఆంధ్రప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసే దిశగా కీలక అడుగు పడింది. గుజరాత్ రాజధాని గాంధీనగర్‌లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌తో ఏపీ ఐటీ, మానవ వనరుల శాఖల మంత్రి నారా లోకేశ్ సమావేశమయ్యారు. - మిగతా2లో

## ఫామ్ హౌస్ లో ప్రభుత్వ భూమి ఉన్నట్లు రుజువు చేస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటారా

-ఫామ్ హౌస్ వద్ద పసుపు నీళ్లతో శుద్ధి చేయడం పై మాజీ ముఖ్యమంత్రి కె సి ఆర్ ఎందుకు స్పందించలేదు

-రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



వార్త సాక్ష్యం : రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్ హౌస్ తో పాటు హరీష్ రావు, కేటీఆర్ బినామీ ల బీఆర్ఎస్ నాయకుల ఆధీనంలో ఉన్న ఫామ్ హౌస్ ల్లో ప్రభుత్వ భూములు ఉన్నట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటారా అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కు సవాల్ విసిరారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసి మీడియా సమావేశంలో మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ పదేళ్లపాటు రాష్ట్రాన్ని పరిపాలించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, గంగుల కమలాకర్ - మిగతా2లో

## ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయం

వార్త సాక్ష్యం: ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కేసులో సుప్రీంకోర్టు తీర్పును మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నానని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. పార్టీ ఫిరాయింపుల చట్టం ఉల్లంఘన పై సుప్రీంకోర్టు తీర్పు చెంపపెట్టు అని అభివర్ణించారు. ఇది అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలకు గుణపాఠమని అన్నారు. పార్టీ ఫిరాయింపునకు పాల్పడిన ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యవహారంలో సుప్రీంకోర్టు గురువారం స్పందించింది. ఈ నేపథ్యంలో దీనిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. నాడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకుని బీఆర్ఎస్ ప్రభుత్వం చట్ట వ్యతిరేకంగా మంత్రులను చేసిందని.. - మిగతా2లో



# నవంబర్‌లో విశాఖ సదస్సు.. దేశ, విదేశాల్లో ఏపీ ప్రభుత్వ రోడ్‌షోలు..

రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా, పారిశ్రామికవేత్తల్లో నూతనోత్సాహం నింపేలా విశాఖపట్నంలో నిర్వహించనున్న 'సీఐఐ భాగస్వామ్య సదస్సు-2026'ను ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ సదస్సు కేవలం ఒప్పందాలకే పరిమితం కాకుండా, ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌ను ప్రపంచానికి చాటిచెప్పేలా ఉండాలని స్పష్టం చేశారు. నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖలో జరగనున్న ఈ సదస్సు సన్నాహకాలపై గురువారం సచివాలయంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. సదస్సుకు ముందు రాష్ట్రంలోని ఐదు కీలక ప్రాంతాల్లో రీజినల్ కాన్ఫరెన్సులు నిర్వహించి, స్థానిక ప్రత్యేకతలకు అనుగుణంగా పెట్టుబడులను ఆకర్షించాలని దిశానిర్దేశం చేశారు.

**ఎంఎస్ఎంఈలకు పెద్దపీట.. వినూత్న కార్యక్రమాలు**

ఈసారి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇందులో భాగంగా, భాగస్వామ్య సదస్సుకు ముందే రాష్ట్రంలోని 30 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపనలు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి రీజినల్ కాన్ఫరెన్స్‌లో 'ఎంఎస్ఎంఈ షోకేస్' ఏర్పాటు చేసి వారి ఉత్పత్తులను ప్రదర్శించాలని, స్టార్టప్‌లకు పెట్టుబడులు సమకూర్చేందుకు 'షార్క్ ట్యాంక్' తరహా కార్యక్రమాన్ని ప్రవేశపెట్టాలని వినూత్న సూచన చేశారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లను ఈ ప్రాంతీయ సదస్సులకు అనుసంధానించాలని చెప్పారు. విద్యార్థి దశ నుంచే పారిశ్రామిక స్ఫూర్తిని నింపేందుకు 7వ తరగతి నుంచే పాఠ్యాంశాల్లో ఎంట్రప్రెన్యూర్‌షిప్‌ను చేర్చాలని, 'ఇన్వెస్ట్ కడప' తరహా కార్యక్రమాలను అన్ని జిల్లాల్లో నిర్వహించాలని ఆదేశించారు.

**పాత ఒప్పందాల వేగవంతంపై దృష్టి**

సమీక్ష సందర్భంగా, గతంలో కుదిరిన ఒప్పందాలను (ఎంవోయూ) వేగంగా కార్యరూపంలోకి తీసుకురావడంపై సీఎం ప్రధానంగా దృష్టి సారించారు. 2024 జూన్ నుంచి ఇప్పటివరకు రాష్ట్రానికి రూ.22.57 లక్షల కోట్ల విలువైన 714 ప్రాజెక్టులకు ఎంవోయూలు కుదిరాయని అధికారులు వివరించారు. వీటిలో రూ.16.6 లక్షల కోట్ల విలువైన 473 ప్రాజెక్టులు కన్వర్ట్ అయ్యాయని, 247 ప్రాజెక్టుల పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని (గ్రౌండింగ్) తెలిపారు. అక్టోబర్ చివరి నాటికి పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనల్లో 80 శాతం కన్వర్ట్ చేయాలని, కన్వర్ట్ అయిన వాటిలో 75 శాతం ప్రాజెక్టుల పనులు ప్రారంభించేలా పనిచేయాలని లక్ష్యంగా నిర్దేశించారు.

# సుప్రీంకోర్టులో దానం పిటిషన్ తిరస్కరణ.. ఇక ఖైరతాబాద్‌లో ఉప ఎన్నికే!

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తనను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే ఇవ్వాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. హైకోర్టు తీర్పును సమర్థించింది. ఉపఎన్నికలో పోటీ చేయాలని సూచించింది. పదవితో పాటు పార్టీ మారితే ఫిరాయింపు కిందకే వస్తుందని, అది తప్పని తేల్చి చెప్పింది. దీంతో హైకోర్టు తీర్పు అమల్లోకి రానుంది. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున ఖైరతాబాద్ నుంచి దానం నాగేందర్ గెలిచారు. 2024లో ఆయన కాంగ్రెస్‌లో చేరారు. అదే ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. దీనిపై బీఆర్ఎస్, బీజేపీ నేతలు దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు సెప్టెంబర్ 18న దానం నాగేందర్‌ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించింది. ఖైరతాబాద్ నియోజకవర్గం ఖాళీ అయినట్లు కూడా పేర్కొంది. ఆ తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఉత్తర్వులపై స్టే ఇవ్వాలని కోరారు. అయితే సుప్రీంకోర్టు ఆయన అభ్యర్థనను అంగీకరించలేదు. దీంతో ఖైరతాబాద్ ఎమ్మెల్యే పదవి ఖాళీగా మారిన నేపథ్యంలో అక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది.

# క్షుద్ర పూజలు చేశానంటూ తప్పుడు ప్రచారం

పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌పై అన్ని సాక్ష్యాధారాలతో కేసు ఫైల్ చేశానని చెప్పారు. ఈ విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లానని పేర్కొన్నారు. తన పిటిషన్‌ను కోర్టు అనుమతించిందని అన్నారు. సెప్టెంబర్ 30వ తేదీన తన స్టేట్‌మెంట్ రికార్డ్ చేస్తామని కోర్టు స్పష్టం చేసిందని తెలిపారు. గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు వద్ద ఆయన మాట్లాడారు. తనపై అసత్య ప్రచారాల డెఫర్మేషన్ (పరువు నష్టం) కేసు ఫైల్ చేశానని పేర్కొన్నారు. ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు ఏమైందని కాంగ్రెస్ నేతలను ఈ సందర్భంగా నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ డైవర్షన్ పాలిటిక్స్ పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడేళ్లైనా డిప్యూటీ స్పీకర్ నియామకం జరగలేదని ఆరోపించారు. సభ హక్కుల ఉల్లంఘన నోటీస్ ఇచ్చినా స్పీకర్ పట్టించుకునే పరిస్థితి లేదని పెదవి విరిచారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అబద్ధాలు తప్ప.. చేసింది ఏమి లేదని అన్నారు. తన విషయంలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, అద్దంకి దయాకర్ అబద్దాలు ప్రచారం చేస్తున్నారని నిప్పులు చెరిగారు. భవిష్యత్తులో అబద్ధాలు ప్రచారం చేస్తే ఎవరిని వదలమని స్పష్టం చేశారు. దానం నాగేందర్ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు సీఎం రేవంత్ రెడ్డికి చెంపపెట్టు అని అభివర్ణించారు. లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ.. రాజ్యాంగం సంరక్షకుడిగా వ్యవహరిస్తున్నాడని మరి ఇప్పుడు ఏమైందంటూ సందేహం వ్యక్తం చేశారు. ఎవరైతే పార్టీలు మారారో.. ఆ శాసనసభ్యులందరితో రాజీనామా చేయించాలని ఈ సందర్భంగా రాహుల్ గాంధీని ఆయన డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత అయినా పార్టీ మారిన ఎమ్మెల్యేలకు కనువిప్పు కావాలని హరీశ్ రావు పేర్కొన్నారు. పార్టీ మారిన శాసన సభ్యులందరికీ.. దానం నాగేంద్ర తీర్పు ఎదురవుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తప్పు చేసిందని ప్రజలు తెలుసుకున్నారని అభిప్రాయపడ్డారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలను కాపాడాలని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ప్రయత్నించారని ఆరోపించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలందరూ రాజీనామాలు చేయాలని ఈ సందర్భంగా తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు డిమాండ్ చేశారు.

# గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్‌తో నారా లోకేశ్ భేటీ..

ఈ సందర్భంగా రెండు తీరప్రాంత రాష్ట్రాల పరస్పర సహకారంతో దేశాభివృద్ధికి దోహదపడే పలు కీలక ప్రతిపాదనలను ఆయన ముఖ్యమంత్రి ముందుంచారు. ముఖ్యంగా, గుజరాత్ పశ్చిమ తీరాన్ని, ఆంధ్రప్రదేశ్ తూర్పు తీరాన్ని కలుపుతూ 'కోస్ట్ టు కోస్ట్' వాణిజ్య కారిడార్ ఏర్పాటు ఆవశ్యకతను లోకేశ్ నొక్కిచెప్పారు. ఈ భేటీలో మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ.. దేశ ఆర్థిక ప్రగతిలో కీలకమైన తీరప్రాంత రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, గుజరాత్ ఏకతాటిపై నిలవాల్సిన అవసరం ఉందని అన్నారు. తూర్పు తీరానికి గేట్‌వేగా ఉన్న ఏపీ, పశ్చిమ తీరంలో కీలకంగా ఉన్న గుజరాత్ సమన్వయంతో పనిచేస్తే సముద్ర, పోర్టుల ఆధారిత పరిశ్రమలు గణనీయమైన వృద్ధిని సాధిస్తాయని వివరించారు. గుజరాత్ మోడల్ స్ఫూర్తితోనే ఏపీలో రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట వంటి నాన్-మేజర్ పోర్టులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. పోర్టుల ఆధారిత పారిశ్రామికీకరణ, ప్రైవేట్ పోర్టుల నిర్వహణలో ఉత్తమ పద్ధతులను పంచుకునేందుకు 'కోస్ట్ టు కోస్ట్' లాజిస్టిక్స్, వాణిజ్య కారిడార్ ఎంతో ఉపకరిస్తుందని ప్రతిపాదించారు. గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీ ఫ్రేమ్‌వర్క్‌ను మంత్రి లోకేశ్ ప్రత్యేకంగా ప్రశంసించారు. దీనిని ఆదర్శంగా తీసుకుని, ఏపీలోని విశాఖపట్నం, అమరావతి ప్రాంతాల్లో ఆధునిక బిజినెస్ డిస్ట్రిక్ట్‌లను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. గిఫ్ట్ సిటీలో అమలు చేస్తున్న సింగిల్-విండో క్లియరెన్స్, డెవలపర్లకు ఇచ్చే ప్రోత్సాహకాలపై తమకు అవగాహన కల్పించి, సాంకేతిక సహకారం అందించాలని కోరారు. ఏపీలో సెమీకండక్టర్, గ్రీన్ హైడ్రోజన్ (కాకినాడ హబ్), ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీల (కొప్పర్తి, ఓర్వకల్లు) ఏర్పాటు ద్వారా పారిశ్రామిక సప్లయ్ చైన్‌ను పటిష్ఠం చేస్తున్నామని సీఎంకు వివరించారు. అదేవిధంగా, అక్టోబర్ 11 నుంచి 20 వరకు విజయవాడ పున్నమి ఘాట్‌లో జరగనున్న 'విజయవాడ ఉత్సవ్'కు హాజరుకావాల్సిందిగా ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌ను లోకేశ్ సాదరంగా ఆహ్వానించారు.

## ఫామ్ హౌస్ లో ప్రభుత్వ భూమి ఉన్నట్లు రుజువు చేస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటారా

పదేళ్లపాటు రాష్ట్రాన్ని పరిపాలించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, గంగుల కమలాకర్ వంటి బీఆర్ఎస్ నాయకుల వద్ద ప్రభుత్వ భూమి ఉన్నట్లు సాక్ష్యాధారాలతో నిరూపించి చట్ట ప్రకారం స్వాధీనం చేసుకుంటామని మంత్రి తెలిపారు. బీఆర్ఎస్ నాయకుల వద్ద ప్రభుత్వ భూమి ఉన్నట్లు నిరూపిస్తే మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ శాశ్వతంగా రాజకీయాల నుండి తప్పకుంటావా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వానికి దళితులు అంటే చిన్న చూపు అని మంత్రి లక్ష్మణ్ కుమార్ ఆరోపించారు. కేసీఆర్ ఫామ్ హౌస్ వద్ద దళితులు ధర్నా చేస్తే పసుపు నీళ్లతో శుద్ధి చేసిన సంఘటనపై నేటి వరకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఎందుకు స్పందించడం లేదని మంత్రి ప్రశ్నించారు. దళితులు ధర్నా చేసిన ప్రదేశాన్ని శుద్ధి చేయడం పై బీఆర్ఎస్ ఎస్సీ సెల్ నాయకులు కేసిఆర్ క్షమాపణ చెప్పే విధంగా ఒత్తిడి తీసుకురావాలని మంత్రి అన్నారు. 2013 తర్వాత రాష్ట్రంలో దళితులపై జరిగిన దాడులు నమోదైన కేసులపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఏనాడు సమీక్ష సమావేశం నిర్వహించలేదని అయన మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజా పాలన లో రెండు రోజుల క్రితం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ హై లెవెల్ సమావేశం నిర్వహించి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులపై సమీక్ష నిర్వహించడం జరిగిందని మంత్రి తెలిపారు. దళితులపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఎలాంటిదో ఇదే నిదర్శనం మంత్రి అన్నారు. ధర్మారం మండలంలోని సర్వే నంబర్ 679 పై సమగ్ర విచారణ చేస్తున్నామని ఈ సర్వే నంబర్ కు సంబంధించి ఓఆర్ సీ ఎప్పుడు ఇచ్చారని ఇనాం హక్కుదారులు ఎంత మంది ఉన్నారని ప్రొబిటెడ్ ల్యాండ్ ను పట్టా ల్యాండ్ గా ఎలా మార్చారనిఅన్ని కోణాల్లో విచారణ పూర్తి అవుతుందని మంత్రి తెలిపారు. కొంత మంది సంపన్నులు ఈ భూములు దక్కించుకోవడానికి కోర్టులను ఆశ్రయిస్తున్నారని పేదల భూములు పేద ప్రజలకు అందే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మండలంలోని ప్రభుత్వ భూములు సర్వే చేయించి అర్హులైన పేదలందరికీ భూములు పంపిణీ చేస్తామని మంత్రి తెలిపారు. ధర్మారం మండలం కేంద్రంలో జక్కన్న పల్లి తో పాటు ఎమ్మార్వో ఆఫీస్ పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని లేఔట్ చేసి అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు అందజేస్తామని మంత్రి తెలిపారు. పార్టీలు, కులాలకు సంబంధం లేకుండా నిజమైన పేదలకు డ్రా పద్ధతిలో ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని మంత్రి తెలిపారు. రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి డాక్టర్ వివేక్ చేతుల మీదుగా త్వరలోనే ఏటీసీ ఐటీఐ పనులు ప్రారంభిస్తామని అన్నారు . ధర్మారం మండలం ఎర్రగుంటపల్లి లో ఏటీసీ నిర్మాణం చేస్తామని మంత్రి తెలిపారు. ధర్మారం మండల సమగ్ర అభివృద్ధికి పలు ప్రణాళికలు తయారుచేసి 100% అభివృద్ధి జరిగే విధంగా ముందుకు సాగుతున్నమని మంత్రి తెలిపారు. మంత్రి వెంట డి సి సి ప్రధానకార్యదర్శి గాగిరెడ్డి తిరుపతి రెడ్డి, కార్యదర్శి కొత్త నర్సింహం,మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రంజిత్ తోపాటు మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులువీరుపాల్, కాడే సూర్యనారాయణ, రాజేశం గౌడ్, దాగెటీ ఉదయ్, ఒరేం చిరంజీవి తదితరులు ఉన్నారు.

## ట్రంప్-జిన్‌పింగ్ భేటీకి ముందే కీలక డీల్..

## అమెరికా-చైనా వాణిజ్య సంధి పొడిగింపు!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భేటీకి ముందే ఈ నిర్ణయం వెలువడింది. అమెరికాకు చైనా అరుదైన ఖనిజాల సరఫరాను కొనసాగించ నుంది. బదులుగా చైనా పై అగ్రరాజ్యం కొన్ని సుంకాలు, వాణిజ్య ఆంక్షలను తాత్కాలికంగా నిలిపివేయనుంది. ఇరు దేశాలు ఆర్థిక అంశాల పై మరింత చర్చించేందుకు ఈ పొడిగింపు ఉపయోగపడుతుందని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెస్సెంట్ తెలిపారు. ఈ పరిణామం భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లకు సానుకూలంగా మారే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. అయితే దీనితో వాణిజ్య వివాదాలన్నీ పరిష్కారమైనట్లు కాదని నిపుణులు చెబుతున్నారు. అధునాతన సాంకేతికత, పెట్టుబడులు, కృత్రిమ మేధ, భద్రత వంటి అంశాలు ఇంకా చర్చల్లో ఉన్నాయి. జాతీయ భద్రతకు ముప్పు కలిగించే ఏఐ ఘటనలపై పరస్పరం సమాచారం ఇచ్చుకునే విధానంపైనా చర్చ జరిగే అవకాశం ఉంది. ఇరాన్, తైవాన్ అంశాలు కూడా ట్రంప్-జిన్‌పింగ్ చర్చల్లో కీలకంగా మారనున్నాయి. ఇరాన్‌తో చైనా సంబంధాలు, తైవాన్‌పై అమెరికా వైఖరిని జిన్‌పింగ్ ప్రశ్నించే అవకాశం ఉంది. అయితే తాజా వాణిజ్య సంధి పొడిగింపుతో ఈ సమస్యలకు పరిష్కారం లభించలేదు. జిన్‌పింగ్ పర్యటన శుక్రవారం వరకు కొనసాగనుంది. గురువారం వైట్‌హౌస్‌లో అధికారిక స్వాగత కార్యక్రమంతో పాటు విందు జరగనుంది. ఇరు దేశాల మధ్య మరిన్ని ఒప్పందాలు కుదురుతాయా? అన్నది ప్రధాన చర్చగా మారింది.

## అభివృద్ధి ఒక మానవ హక్కు.. సమ్మిళిత అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

అభివృద్ధి అనేది ప్రతి మనిషికి ఉన్న విడదీయరాని మానవ హక్కు అని, దాన్ని సాధించేందుకు తాము కట్టుబడి ఉన్నామని ఐక్యరాజ్యసమితి (ఐరాస) వేదికగా భారత్ మరోసారి స్పష్టం చేసింది. సమ్మిళిత అభివృద్ధి, అంతర్జాతీయ సహకారం, బహుపాక్షిక సంస్కరణల పట్ల తమ నిబద్ధతను పునరుద్ఘాటించింది. ఈ మేరకు 'అభివృద్ధి హక్కుపై ఒప్పందాన్ని' వీలైనంత త్వరగా ఆమోదించాలని భారత్ మద్దతు తెలిపింది. ఐరాస సర్వప్రతినిధి సభలో 'అభివృద్ధి హక్కు ప్రకటన' 40వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో భారత విదేశాంగ శాఖ కార్యదర్శి (పశ్చిమ దేశాలు) సిబి జార్జ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన భారత జాతీయ ప్రకటనను వినిపిస్తూ, దేశం వైఖరిని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' ద్వారా ధ్రువీకరించారు. ఐక్యరాజ్యసమితి ప్రకారం.. ఈ అభివృద్ధి హక్కు అనేది ప్రతి వ్యక్తి, ప్రజలందరూ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ అభివృద్ధిలో పాలుపంచుకోవడానికి, తోడ్పడటానికి, ఆ ఫలాలను ఆస్వాదించడానికి అధికారం కల్పిస్తుంది. దీని ద్వారానే అన్ని మానవ హక్కులు, ప్రాథమిక స్వేచ్ఛలు పూర్తిగా సాకారం అవుతాయి. గత 40 ఏళ్లలో ఈ ప్రకటన స్ఫూర్తితో ప్రపంచవ్యాప్తంగా సుస్థిర అభివృద్ధి, పేదరిక నిర్మూలన, విద్య, ఆరోగ్య సంరక్షణ వంటి రంగాలలో గణనీయమైన పురోగతి నమోదైంది. కోట్లాది మంది ప్రజలు తీవ్ర పేదరికం నుంచి బయటపడ్డారు. అయినప్పటికీ, ఈ అభివృద్ధిలో చాలా అసమానతలు ఉన్నాయని, పురోగతి అందరికీ సమానంగా చేరలేదని ఐక్యరాజ్యసమితి ఒక ప్రకటనలో పేర్కొంది. అనేక దేశాలు తమ అభివృద్ధికి ఆటంకంగా ఉన్న వ్యవస్థాగత అడ్డంకులను, నిధుల కొరతను ఎదుర్కొంటున్నాయని తెలిపింది. ఈ నేపథ్యంలో 40వ వార్షికోత్సవం ప్రస్తుత ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడానికి, అందరికీ మరింత సమ్మిళిత, సమానమైన భవిష్యత్తును అందించడానికి ఒక ముఖ్యమైన అవకాశమని ఐరాస అభిప్రాయపడింది.

## ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయం

నాడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకుని బీఆర్ఎస్ ప్రభుత్వం చట్ట వ్యతిరేకంగా మంత్రులను చేసిందని.. నేడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేను చేర్చుకుని కాంగ్రెస్ తమ పార్టీ తరపున ఎంపీగా పోటీ చేయించిందని గుర్తు చేశారు. త్వరలో జరగనున్న ఖైరతాబాద్ ఉప ఎన్నికలో.. రెండు ఫిరాయింపు పార్టీలకు ప్రజలు బుద్ధి చెబుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఉప ఎన్నికలో బీజేపీ ఘనవిజయం ఖాయమని కిషన్ రెడ్డి జోస్యం చెప్పారు. దానం నాగేందర్ పిటిషన్ సుప్రీంకోర్టు కొట్టివేయడంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యం అవుతుందని తెలిపారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి దానం నాగేందర్ బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి.. 2024లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారని తెలిపారు. దీనిపై తెలంగాణ హైకోర్టును బీజేపీ ఆశ్రయిస్తే.. 2024 ఏప్రిల్ 23 నుంచి ఆయనను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించిందని.. దీన్ని సుప్రీంకోర్టు తాజాగా సమర్థించిందని అన్నారు. ఈ తీర్పు ఒక్క కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన అంశం మాత్రమే కాదని.. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చట్టవ్యతిరేకంగా అనుసరిస్తున్న పార్టీ ఫిరాయింపుల రాజకీయాలకు ఇది ఓ గుణపాఠమని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకోవడం.. వారికి మంత్రిపదవులు ఇవ్వడం తెలంగాణ రాజకీయాల్లో ఈ రెండు పార్టీలు ఓ దురదృష్టకరమైన సంస్కృతిగా మార్చారని మండిపడ్డారు. ప్రజా తీర్పును కాలరాయడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తెలంగాణలో పోటీ పడుతూ.. ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ ఫిరాయింపులను విమర్శించడం అధికారంలోకి వచ్చాక అదే ఫిరాయింపులను ప్రోత్సహించడం ఈ రెండు పార్టీల రాజకీయ ద్వంద్వ వైఖరికి అద్దం పడుతుందని చెప్పారు. ప్రజా తీర్పును తమ రాజకీయ అవసరాలకు అనుగుణంగా కాల రాస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ అవకాశవాద రాజకీయాలకు సుప్రీంకోర్టు తీర్పు స్పష్టమైన హెచ్చరిక అని తెలిపారు. దానం నాగేందర్ ఎమ్మెల్యే పదవి అనర్హత కారణంగా ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయిందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో అంతిమ నిర్ణేతలు ప్రజలేనని వివరించారు.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
శుక్రవారం 25 సెప్టెంబర్ 2026

# సంపాదకీయం

## ఉద్యోగుల ఆరోగ్యాన్ని 'సిస్టమ్'కు వదిలేయొద్దు



ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల కుటుంబాలకు మెరుగైన ఆరోగ్య భద్రత కల్పించేందుకు ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తోంది. అయితే ఉద్యోగి తన వేతనం నుంచి ప్రతి నెలా నిర్ణీత మొత్తాన్ని చందాగా చెల్లిస్తున్నప్పుడు అవసరమైన సమయంలో తనకు, తన కుటుంబ సభ్యులకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయనే నమ్మకం ఉండాలి. ప్రస్తుతం ఆరోగ్య కార్డుల జారీ, కుటుంబ సభ్యుల వివరాల నమోదు, కార్డుల డౌన్‌లోడ్ వంటి అంశాల్లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలు ఆ నమ్మకాన్ని దెబ్బతీస్తున్నాయి. ఇది కేవలం ఒక వెబ్‌సైట్‌లోని సాంకేతిక లోపంగా పరిగణించాల్సిన విషయం కాదు. ఆరోగ్య భద్రతకు సంబంధించిన పరిపాలనా సమస్యగా చూడాలి. ఆరోగ్య కార్డును డౌన్‌లోడ్ చేసుకోలేకపోవడం, ఎన్.ఇ.హెచ్.ఎస్ వెబ్‌సైట్‌లో కుటుంబ సభ్యుల వివరాలు పూర్తిగా కనిపించకపోవడం, కొంతమంది ఆధారితుల పేర్లు మాత్రమే కనిపించడం, కొన్ని సందర్భాల్లో ఉద్యోగి లేదా పెన్షనర్‌తో పాటు ఆధారితుల కార్డులు కూడా కనిపించకపోవడం, ఫొటోలు సరిగా లేకపోవడం వంటి సమస్యలు ఉన్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. ఆమోదించిన తర్వాత మార్పులకు అవకాశం లేకపోవడం మరో సమస్య. ఒక కుటుంబంలో అర్హులైన నలుగురు ఆధారితులు ఉంటే, పోర్టల్‌లో ఇద్దరి పేర్లు మాత్రమే కనిపిస్తే మిగిలిన ఇద్దరి వైద్య హక్కుల పరిస్థితి ఏమిటి ముఖ్యంగా అనారోగ్యానికి గురయ్యే వ్యక్తి... పోర్టల్‌లో కనిపించని ఆధారితుడే అయితే పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతుంది. చందా మాత్రం సక్రమంగా తీసుకుంటూ సేవ పొందే సమయంలో 'సాంకేతిక సమస్య' అని చెప్పడం సమర్థనీయం కాదు. మరో ముఖ్యమైన సమస్య– డీడీఓలు, ఎస్టీవోలకు ఎదురవుతోంది. ఉద్యోగి లేదా ఉపాధ్యాయుడు సమర్పించిన కుటుంబ సభ్యుల వివరాలను సంబంధిత అధికారులు పరిశీలించి ఆమోదిస్తారు. అయితే ఒకసారి ఆమోదం పూర్తయిన తర్వాత అందులో తప్పు ఉన్నా, అదనపు ఆధారితుడి పేరు నమోదు చేయాల్సి ఉన్నా, వివరాలు సరిచేయాల్సి ఉన్నా సంబంధిత స్థాయిలో తగిన ఎడిట్ ఆప్షన్ లేదు. డిజిటల్ వ్యవస్థలో తప్పులు జరగడం సాధారణం. ఆ తప్పును సరిచేసే అవకాశం లేకపోవడమే అసలు పరిపాలనా లోపం. దీనికి ప్రత్యామ్నాయంగా స్పష్టమైన సరిదిద్దే యంత్రాంగం ఉండాలి. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ఉమ్మడి జిల్లా స్థాయిలో అధికారులు, మేనేజర్లు, కో--ఆర్డినేటర్లను నియమించింది. ఇది మంచి చర్యే. అయితే ఉమ్మడి జిల్లా స్థాయిలో కేవలం ఒక్కరిని బాధ్యులుగా నియమించడం ప్రస్తుత పరిస్థితుల్లో ఏ మాత్రం సరిపోదు. 1. ప్రతి ఉద్యోగి, ఉపాధ్యాయుడు, పెన్షనర్ తన ఎంప్లాయీ ఐడీ/ పెన్షనర్ ఐడీతో సమస్యను నమోదు చేసుకునే ప్రత్యేక ఫిర్యాదు వ్యవస్థ ఎన్.ఇ.హెచ్.ఎస్‌లో ఉండాలి. ఫిర్యాదుకు ప్రత్యేక టికెట్ నెంబరు ఇవ్వాలి. 2. కార్డు డౌన్‌లోడ్ కాకపోవడం, ఆధారితుల పేరు కనిపించకపోవడం, తప్పు వివరాలు, డూప్లికేట్ వివరాలు వంటి సమస్యలకు 3–4 పని దినాల్లో పరిష్కారం కల్పించే విధానం ఉండాలి. 3. ప్రతి ఉద్యోగి/పెన్షనర్ తన కుటుంబ సభ్యుల జాబితాను చూసుకుని, ఎవరి పేరు నమోదు కాలేదో, ఎవరి వివరాలు తప్పుగా ఉన్నాయో ఆన్‌లైన్‌లో గుర్తించే అవకాశం కల్పించాలి. ఎడిట్ అవకాశం కూడా ఇవ్వాలి. 4. డీడీవో/ఎస్టీవోలకు పరిమితంగా ఎడిట్ అవకాశం ఇవ్వాలి. ముఖ్యమైన మార్పులకు మాత్రమే జిల్లా స్థాయి లేదా రాష్ట్ర స్థాయి అధికారి అనుమతి ఉండేలా వ్యవస్థ రూపొందించాలి. 5. ఆధారితుల పేర్లు లేకపోతే, తిరిగి నమోదుకు ఒక కాలపరిమితితో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి. 6. గతంలో చందా చెల్లింపు వద్దని కోరుకున్న ఉద్యోగులు, పెన్షనర్లకు కూడా తిరిగి ఈ పథకంలో చేరేందుకు అవకాశం కల్పించాలి. 7. సర్వర్ లేదా పోర్టల్ సమస్యల వల్ల డిజిటల్ కార్డు డౌన్‌లోడ్ కాకపోతే, ఎంప్లాయీ ఐడీ/పెన్షనర్ ఐడీ ఆధారంగా తాత్కాలిక డిజిటల్ హెల్త్ కార్డు అందుబాటులోకి తేవాలి. 8. డీడీవో, ఎస్టీవో, జిల్లా మేనేజరు--రాష్ట్ర సాంకేతిక బృందం మధ్య సమన్వయ వ్యవస్థ ఉండాలి. సమస్య పరిష్కార స్థితిని ఉద్యోగి తన మొబైల్ నుంచే తెలుసుకునే విధానం ఉండాలి. 9. ఎన్ని కార్డులు జారీ అయ్యాయి, ఎన్ని డౌన్‌లోడ్ అయ్యాయి, ఎన్ని కుటుంబాల్లో ఆధారితుల వివరాలు అసంపూర్ణంగా ఉన్నాయి, ఎన్ని ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి, ఏ జిల్లాలో ఎక్కువ సమస్యలు ఉన్నాయి అనే వివరాలను అధికారులు ప్రతిరోజూ పర్యవేక్షించే డ్యాష్‌బోర్డు ఏర్పాటు చేయాలి. 10. హెల్ప్‌లైన్‌ను మరింత సమర్థవంతం చేయాలి. ప్రతి ఫిర్యాదుకు టికెట్ నెంబరు, ప్రస్తుత స్థితి, పరిష్కార గడువు ఇవ్వాలి. ఉద్యోగి తన వంతు చందాను చెల్లించడంలో విఫలమైతే ప్రభుత్వం దాన్ని తీవ్రంగా పరిగణిస్తుంది. అదే విధంగా ప్రభుత్వం అందించాల్సిన ఆరోగ్య సేవలను పొందడంలో సాంకేతిక లోపం ఏర్పడితే దానినీ ప్రభుత్వం అంతే తీవ్రంగా పరిగణించి, వెంటనే పరిష్కరించాలి. ఉద్యోగుల ఆరోగ్యాన్ని 'సిస్టమ్'కు వదిలేయకూడదు. ఉత్తమ 'సిస్టమ్' రూపొందించి, ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల ఆరోగ్యాన్ని కాపాడాలి.

# ప్రణయ్ హత్య కేసు ఖైదీ అబ్దుల్ బారీ మృతి

సెప్టెంబర్ 24 వార్త సాక్ష్యం :

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ప్రణయ్ హత్య కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న అబ్దుల్ బారీ చర్లపల్లి జైలులో మృతి చెందాడు. గురువారం జైలులో తీవ్ర అస్వస్థతకు గురైన బారీని చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే గుండె పోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

**-ప్రణయ్ హత్య కేసులో జీవిత ఖైదు**

నల్గొండకు చెందిన అబ్దుల్ బారీ.. 2018లో జరిగిన ప్రణయ్ హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడు. ప్రణయ్‌ను హత్య చేసేందుకు కాంట్రాక్ట్ కిల్లర్ సుభాష్ కుమార్ శర్మకు సహకరించినట్లు పోలీసుల చార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు. ఈ కేసులో 2025 మార్చిలో నల్గొండ కోర్టు తీర్పు వెలువరించింది. బారీ తో పాటు మరో ఐదుగురికి జీవిత ఖైదు విధించగా.. ప్రణయ్‌ను హత్య చేసిన కాంట్రాక్ట్ కిల్లర్ సుభాష్ కుమార్ శర్మకు మరణశిక్ష విధించింది.

**-2018లో ప్రణయ్ హత్య**

2018 సెప్టెంబర్ 14న మిర్యాలగూడలో ప్రణయ్ హత్యకు గురయ్యాడు. ఆస్పత్రి నుంచి భార్య అమృతతో కలిసి బయటకు వస్తున్న సమయంలో కాంట్రాక్ట్ కిల్లర్ సుభాష్ శర్మ కత్తితో దాడి చేసి ప్రణయ్‌ను హత్య చేశాడు. ఈ ఘటనపై అప్పట్లో తీవ్ర సంచలనం రేగింది. కేసులో ప్రధాన నింది తుడిగా ఉన్న అమృత తండ్రి



మారుతీరావు 2020 మార్చి 8న హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు.

**-గతంలో మరో కేసులోనూ అరెస్టు**

అబ్దుల్ బారీ గతంలో గుజరాత్ మాజీ హోంమంత్రి హరేన్ పాండ్యా హత్య కేసులోనూ అరెస్టయ్యాడు. అయితే ఆ కేసులో అతడు నిర్దోషిగా విడుదలయ్యాడు. ప్రస్తుతం ప్రణయ్ హత్య కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న సమయంలోనే బారీ మృతి చెందాడు.

# భీమ్‌రెడ్డి బినామీలపై ఏసీబీ గురి

**-సోదాల్లో రూ.1.04 కోట్ల నగదు స్వాధీనం**

సెప్టెంబర్ 24 వార్త సాక్ష్యం :

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టైన మాజీ డీఎస్పీ సంకిరెడ్డి భీమ్‌రెడ్డి వ్యవహారంలో ఏసీబీ అధికారులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా భీమ్‌రెడ్డికి సంబంధించిన బినామీల ఇళ్లపై ఏసీబీ అధికారులు గురువారం సోదాలు నిర్వహిం చారు. పుప్పాలగూడలోని భీమ్‌రెడ్డి బినామీగా అనుమానిస్తున్న కోమటి వెంకటేష్ ఇంట్లో జరిపిన తనిఖీల్లో రూ.1.04 కోట్ల నగదు లభించినట్లు అధికారులు వెల్లడించారు.ఏసీబీ డీఎస్పీ గంగసాని శ్రీధర్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం రాయదు ర్గంలోని పంచవతి కాలనీతో పాటు భీమ్‌రెడ్డి అనుచ ర్ులకు సంబంధించిన ఇళ్లలోనూ సోదాలు చేపట్టిం ది. ఈ తనిఖీల్లో పలు కీలక ఆధారాలు లభించినట్లు తెలుస్తోంది.

**-రూ.200 కోట్లకు పైగా అక్రమాస్తులు?**

ఈ ఏడాది జులై 2న డీజీపీ కార్యాలయ స్టేషనరీ వింగ్‌లో పనిచేస్తున్న భీమ్‌రెడ్డి నివాసాలు, ఆయనకు సంబంధించిన ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు తొలిసారి సోదాలు నిర్వహించారు. హైదరాబాద్, జహీరాబాద్, రంగారెడ్డి, శంషాబాద్, గచ్చిబౌలి, వికారాబాద్ తదితర ప్రాంతాల్లో మొత్తం 16 చోట్ల తనిఖీలు చేపట్టారు. ప్రాథమిక అంచనాల ప్రకారం భీమ్‌రెడ్డికి రూ.200 కోట్లకు పైగా స్థిర, చర ఆస్తులు ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం.




**-భార్య ఫోన్‌లో కీలక సమాచారం**

తొలి విడత సోదాల్లో అధికారులకు ఓ డైరీ లభించినట్లు ఏసీబీ తెలిపింది. అందులో భీమ్‌రెడ్డికి సంబంధించిన సుమారు 15 మంది బినామీల వివరాలు ఉన్నట్లు గుర్తించారు. అలాగే భీమ్‌రెడ్డి భార్య సెల్‌ఫోన్‌లోని ఫొటోలు, ఇతర సమాచారాన్ని అధికారులు పరిశీలించగా.. కుటుంబ సభ్యులకు కేటాయించిన ఆస్తులు, బినామీల పేర్లపై ఉన్న ఆస్తులు, నగదు లావాదేవీలకు సంబంధించిన వివరాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ ఆధారాలతోనే బినామీల ఇళ్లపై వరుసగా సోదాలు నిర్వహిస్తున్నట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు.

# ఆపదలో అండగా నిలిచిన ఎమ్మెల్యే పాయం-ఎల్‌ఓసీ ద్వారా రూ.2.20 లక్షల వైద్య సాయం అందడంతో అరవింద్ కుటుంబం కృతజ్ఞతలు

సెప్టెంబర్ 24 వార్త సాక్ష్యం :

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, మణుగూరు మండలం ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తూ వైద్య చికిత్సలకు అవసరమైన ఆర్థిక సహాయం అందిస్తున్న పినపాక నియోజకవర్గ పాయం వెంకటేశ్వర్లు గారికి మల్లెలమడుగు గ్రామానికి చెందిన మద్దెల అరవింద్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అశ్వాపురం మండలం మల్లెలమడుగు గ్రామానికి చెందిన మద్దెల అరవింద్‌కు చేతికి సంబంధించిన ఆపరేషన్ అవసరం కాగా, నిజామ్స్ హాస్పిటల్‌లో చికిత్సకు సుమారు రూ.2,20,000 ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. దీంతో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న అరవింద్ కుటుంబానికి సహాయం అందించాలని అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చెంచల రాము ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గారి దృష్టికి తీసుకెళ్లారు.విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వెంటనే స్పందించి, ముఖ్యమంత్రి సహాయనిధి (ఎల్‌ఓసీ) ద్వారా రూ.2,20,000 ఆర్థిక సహాయం మంజూరు చేయించేందుకు కృషి చేశారు. దీంతో అరవింద్‌కు అవసరమైన ఆపరేషన్ విజయవంతంగా పూర్త యింది. ఆపరేషన్ విజయవంతం కావడంతో సంతోషించిన అరవింద్ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు క్యాంపు కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తన వైద్య చికిత్సకు ఆర్థికంగా అండగా నిలిచి, ఆపరేషన్‌కు అవసరమైన సహాయం అందేలా కృషి చేసిన ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా అరవింద్ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. ఆపద



సమయంలో స్పందించి వైద్య చికిత్సకు అవసరమైన సహాయం అందించిన పాయం వెంకటేశ్వర్లు సేవాభావాన్ని అభినంది ంచారు. పేద, నిరుపేద కుటుంబాలకు వైద్య సహాయం అందేలా ఎమ్మెల్యే చేస్తున్న కృషి ఎంతో భరోసానిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పొడిశెట్టి ఖాదర్, మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిరినాకి నవీన్, నాయకులు కోడి అశోక్, భూపాలపట్నం సర్పంచ్ భవతి, తదితరులు పాల్గొన్నారు.

# మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

సెప్టెంబర్ 24 వార్త సాక్ష్యం :

పినపాక నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక కృతజ్ఞతలు నిన్న జరిగిన మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమానికి విశేష స్పందన లభించి, కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, ప్రజలు, కార్యక్రమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు.మంత్రుల పర్యటనను విజయ వంతం చేయడంలో ప్రతి ఒక్కరూ చూపిన సహకారం, సమన్వయం, అంకితభావం అభినంద నీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ముఖ్యంగా కార్యక్ర మానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేసిన రైతులు, ప్రజలకు హృదయపూర్వక ధన్యవా దాలు తెలిపారు.మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగునీటి ప్రయోజనాలు అంద డంతో పాటు, పినపాక నియోజకవర్గంలో వ్యవసాయ రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ మరోసారి ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదాలు.

వార్త సాక్ష్యం
Editor : SAGINALA RAVI KUMAR

# అకాల వర్షాలతో నిర్వాసితుల అవస్థలు...!

- నిలువ నీడ లేక గుడారాల మాటున జీవనం
- వెలుగొండ ప్రాజెక్టు పునరావాస కాలనీల్లో ఆరాకొర ఏర్పాట్లు
- న్యాయం కోసం ఎదురుచూపులు
- న్యాయవాది కోడి మోహన్ రావు స్పందన

మార్కాపురం సెప్టెంబర్ 24 వార్త సాక్ష్యం

అకాల వర్షాలతో వెలుగొండ ప్రాజెక్టు పునరావాస గ్రామాల నిర్వాసితుల జీవనం అతలాకుతల మవుతోంది. సుంకేసుల, గుండంచర్ల, కలనూతల తదితర పునరావాస కాలనీల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు అందుబాటులో లేకపోవడంతో నిర్వాసిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. వర్షం వస్తే ఎక్కడ తలదాచుకోవాలో తెలియని పరిస్థితుల్లో పిల్లాపాపలతో కుటుంబాలు కాలం వెళ్లదీస్తున్నాయి. కొందరు కుటుంబాలు తాత్కాలిక గుడారాల మాటున జీవనం సాగిస్తుండటంతో వర్షపు నీరు, బురద, పారిశుధ్య సమస్యలు వారిని తీవ్రంగా వేధిస్తున్నాయి. ప్రత్యేకించి దళిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు, విద్యుత్, రహదారులు, డ్రైనేజీ, పారిశుధ్యం, శాశ్వత నివాస సదుపాయాలు వంటి కనీస వసతులు పూర్తిస్థాయిలో అందకపోవడం తో తమ జీవనం ప్రశ్నార్థకంగా మారిందని వారు



చెబుతున్నారు.

**న్యాయం కోసం అభాగ్యుల ఎదురుచూపులు**

ప్రాజెక్టు కోసం తమ భూములు, ఇళ్లు, స్వగ్రామాలను వదులుకున్న నిర్వాసితులకు పున రావాసం ద్వారా గౌరవప్రదమైన జీవితం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందని బాధితులు పేర్కొంటున్నారు. తమ సమస్యలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పూర్తిస్థాయి పరిష్కారం లభించలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**న్యాయవాది కోడి మోహన్ రావు స్పందన**

నిర్వాసితుల సమస్యలపై న్యాయవాది కోడి మోహన్ రావు స్పందిస్తూ, వెలుగొండ ప్రాజెక్టు పునరావాస గ్రామాల్లో పరిస్థితిని అధికారులు తక్షణమే పరిశీలించాలని కోరారు. వర్షాకాలంలో గుడారాల కింద పిల్లాపాపలతో జీవిస్తున్న కుటుంబాలకు వెంటనే సురక్షితమైన తాత్కాలిక వసతి కల్పించాలని, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, రహదారులు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలను అత్యవసరంగా ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ప్రాజెక్టుల కోసం తమ సొంత ఇళ్లు, భూములు, గ్రామాలను త్యాగం చేసిన నిర్వాసితులు ఇలా వర్షాలకు తడుస్తూ గుడారాల కింద జీవించాల్సిన పరిస్థితి రావడం బాధాకరం. ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి, పునరావాస సమస్యలను పరిష్కరించి ప్రతి నిర్వాసిత కుటుంబానికి గౌరవప్రదమైన జీవన పరిస్థితులు కల్పించాలి" అని కోడి మోహన్ రావు అన్నారు.బాధితుల సమస్యలపై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, పునరావాస కాలనీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# పేదల పక్షాన మూడు దశాబ్దాల న్యాయ పోరాటం...!

- కే.ఎల్.రాజు సేవలను గుర్తించిన మార్కాపురం జిల్లా వాసులు
- అడిషనల్ పబ్లిక్ ప్రసిక్యూటర్ గా మార్కాపురం జిల్లా కోర్టులో 2012 నుండి 2016 వరకు సేవలు అందించిన రాజు
- బాధితులకు అండగా.. న్యాయం కోసం నిష్పక్షపాతంగా సేవలందిస్తున్న న్యాయవాది

మార్కాపురం సెప్టెంబర్ 24 వార్త సాక్ష్యం

న్యాయవృత్తిని కేవలం ఉపాధిగా కాకుండా సామాజిక బాధ్యతగా భావిస్తూ గత మూడు దశాబ్దాలుగా న్యాయ సేవలందిస్తున్న న్యాయవాది రాజు. మార్కాపురం కోర్టులో సుమారు 25 సంవత్సరాలుగా న్యాయవాదిగా కొనసాగుతూ పేదలు, బలహీన వర్గాలు, బాధితులకు న్యాయ సహాయం అందిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందారు. న్యాయం కోసం కోర్టును ఆశ్రయించే ఆర్థికంగా వెనుకబడిన వారికి తన వంతు సహాయం అందిస్తూ, అనేక సందర్భాల్లో ఉచితంగా న్యాయ సలహాలు మరియు న్యాయ సేవలు అందించినట్లు ఆయన సహచరులు పేర్కొంటున్నారు. బాధితులకు న్యాయం జరిగేలా చట్టపరమైన మార్గాల్లో పోరాడటం ఆయన న్యాయ ప్రస్థానంలో ముఖ్యమైన అంశంగా నిలిచింది.

**మూడు సంవత్సరాలు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్గా సేవలు**

కే.ఎల్. రాజు మూడు సంవత్సరాల పాటు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్గా మార్కాపురం జిల్లా కోర్టు నందు సేవలందించారు. ప్రభుత్వ తరపున కేసులను



వాదిస్తూ తన న్యాయపరిజ్ఞానాన్ని, అనుభవాన్ని వినియోగించారు.

**క్రిమినల్ కేసుల్లో ప్రత్యేక అనుభవం**

ముఖ్యంగా క్రిమినల్ కేసుల్లో అనుభవం కలిగిన న్యాయవాదిగా రాజుకు గుర్తింపు ఉంది. క్లిష్టమైన కేసుల్లో చట్టపరమైన అంశాలను పరిశీలించి, బాధితుల తరపున సమర్థవంతమైన వాదనలు వినిపిస్తూ న్యాయం కోసం కృషి చేస్తున్నారు.

**ప్రముఖ న్యాయవాదుల మార్గదర్శకత్వం**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ సీనియర్ న్యాయవాది మరియు మాజీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గౌరవనీయులైన టి. అంజయ్య క్యాబినెట్ లో మంత్రిగా పని చేసిన శ్రీ గొల్లపూడి వేదాంతరావు అప్పటి గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి, వారి వద్ద 6 సంవత్సరాలు న్యాయపరమైన అనుభవాన్ని, మార్గదర్శకత్వాన్ని పొందిన రాజు తన న్యాయవృత్తిలో ఆ అనుభవాన్ని కొనసాగిస్తున్నారు.

**పేదలకు న్యాయం అందించడమే లక్ష్యం**

డబ్బు లేక న్యాయాన్ని పొందలేని పరిస్థితిలో ఉన్న



సామాన్యులకు చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పిస్తూ, వారికి అందుబాటులో ఉన్న న్యాయ మార్గాలను వివరిస్తూ రాజు తన సేవలను కొనసాగిస్తున్నారు. మూడు దశాబ్దాల న్యాయ అనుభవం, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్గా పనిచేసిన అనుభవం, ముఖ్యంగా క్రిమినల్ కేసులపై అవగాహనతో పాటు పేదలు, బాధితులకు అందిస్తున్న న్యాయ సహాయం ఆయన న్యాయ ప్రస్థానంలో ప్రత్యేకతగా నిలుస్తోంది. "న్యాయం అనేది ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండాలి" అనే భావనతో న్యాయ సేవలను కొనసాగిస్తున్న కె. ఏల్ . రాజు, మార్కాపురం న్యాయరంగంలో తనదైన సేవా ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు.

# నెమళ్లకుంట చెంచుగూడెంలో సమస్యల తిష్ట...!





- గూడెం అంతా పిచ్చి మొక్కల మయం
- నిరుపయోగంగా పాఠశాల మరుగుదొడ్లు
- మా కష్టాలు పట్టేది ఎవరికి అని అడవి బిడ్డల ఆవేదన

బండి ఆత్మకూరు సెప్టెంబర్ 24 వార్త సాక్ష్యం

బండి ఆత్మకూరు మండల పరిధిలోని నిమ్మలకుంట చెంచుగూడెం ను పి ఫోర్ లో భాగంగా నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి దత్తత తీసుకున్నారు. దత్తత తీసుకున్న నాటినుండి కలెక్టర్ ఆధ్వర్యంలో గూడెంలో చాలా అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. కానీ గత కొన్ని నెలలుగా అధికారులు గూడెం వైపు కన్నెత్తి కూడా చూడకపోవడం బాధాకరం. కలెక్టర్ వస్తే తప్ప గూడెంలో పనిచేసే దిక్కులేదు. ఇప్పటికే గూడెం మొత్తం పిచ్చిముక్కలతో నిండిపోయింది. దీంతో రాత్రి వేళల్లో దోమల బెడద ఎక్కువగా ఉందని, విష సర్పాలు కూడా ఇలలోకి వస్తున్నాయని గూడెం చెంచులు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల చుట్టూ పిచ్చి మొక్కలతో నిండిపోవడంతో పిల్లలను బడికి పంపాలంటే తల్లిదండ్రులు భయాందోళన గురవుతున్నారు. అంతేకాకుండా గూడెంలో దాదాపు నాలుగు లక్షల రూపాయలతో మినరల్ వాటర్ ట్యాంకును కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. అది కూడా బోనాల ముచ్చటగా మారింది. ప్రస్తుతం ఆ ట్యాంకి గదికి తాళం వేయడం జరిగింది. గ్రామంలో డ్రైనేజీ సమస్య కూడా తీవ్రతరమైంది. గ్రామంలో శానిటేషన్ పనులు చేయాల్సిన పంచాయతీ అధికారులు, పర్యవేక్షణ చేయవలసిన మండల ప్రత్యేక అధికారి, గ్రామ ప్రత్యేక అధికారి కూడా గూడెంలోని చెంచు లు ఎలా ఉన్నారు, ఇక్కడ సమస్యలు ఏమిటని అడిగిన దాఖలాలు లేవని అడవి బిడ్డలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. కలెక్టర్ మేడం వస్తున్నారంటే హడావిడిగా ఆర్భాటం చేస్తారే తప్ప మిగిలిన కాలంలో ఏ అధికారి కూడా మా గూడెం కొచ్చిన దాఖలాలు లేవని చెంచుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల విద్యార్థిని విద్యార్థులు కానీ పాఠశాల మహిళా సిబ్బంది కానీ బాత్రూములకు వెళ్లాలంటే వెళ్లలేని దుస్థితి. బాత్రూములకు డోర్లు లేవు, నీటి వసతి కూడా లేదు. స్వయంగా కలెక్టర్ దత్తత తీసుకున్న గ్రామంలో అధికారులు నిర్లక్ష్యం వహించడమేమిటో అర్థం కాని పరిస్థితి. ఇప్పటికైనా నంద్యాల జిల్లా కలెక్టర్ తమ దతత గ్రామమైన నెమళ్లకుంట చెంచుగూడెంలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని చెంచులు కోరుతున్నారు

## సిఆర్టీ ఉపాధ్యాయులకు జీతాలు వెంటనే చెల్లించాలి

- గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు జవహర్ నాయక్

ఆత్మకూరు సెప్టెంబర్ 24 వార్త సాక్ష్యం



నంద్యాల జిల్లా లోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనచేసే సిఆర్టీ ఉపాధ్యాయుల కు జూన్..12 నుంచి ఇప్పటి వరకు గత నాలుగు నెలల నుంచి జీతాలు లేవు. జీతాలు ఇవ్వండి మహాప్రభో అని గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు జవహర్ నాయక్ అధికారులను కోరారు. గురువారం నాడు ఆత్మకూరు పట్టణంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ నంద్యాల జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పని చేసే సిఆర్టీ ఉపాధ్యాయులకు జూన్..12 నుంచి ఇప్పటి వరకు జీతాలు ఇవ్వలేదని, మిగతా జిల్లా లలో సిఆర్టీ ఉపాధ్యాయులకు జీతాలు ఇచ్చారని, మన జిల్లాలో రెగ్యులర్ గిరిజన సంక్షేమ శాఖ అధికారి లేకపోవడంతో ఇంతవరకు జీతాలు అందలేదని, జీతాలు రాకపోవడం తో నిత్యావసర వస్తువుల పెరుగుదల,కుటుంబ పోషణ,,విద్యార్థుల చదువులు, వైద్యం ఖర్చులతో సతమత మవుతున్నారని, రెగ్యులర్ గిరిజన సంక్షేమ శాఖ అధికారిని నియమించాలని, సిఆర్టీ ఉపాధ్యాయులకు జీతాలు వేంటనే చెల్లించాలని ఆయన అధికారులను కోరారు.

## నెమళ్ళకుంటలో ఇండోస్ వారి మెగా ఉచిత వైద్య శిబిరం

- దోమతెరలు రగ్గులు పంపిణీ చేసిన వైద్యులు జహంగీర్





బండి ఆత్మకూరు సెప్టెంబర్ 24 వార్త సాక్ష్యం

బండి ఆత్మకూరు మండల పరిధిలోని నెమెళ్ళ కుంట చెంచుగూడెంలో నంద్యాలకు చెందిన ఇండోస్ గుండె ఆసుపత్రి వైద్యులు జహంగీర్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గూడెంలోని దాదాపు 50 కుటుంబాలకు చెందిన చెంచులకు బిపి షుగర్ గుండె జబ్బులకు సంబంధించి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఇండోస్ ఆసుపత్రి వైద్యులు జహంగీర్ ఆధ్వర్యంలో 50 కుటుంబాలకు దోమతెరలు రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు జహంగీర్ మాట్లాడుతూ సొంత మండలం అయిన చెంచులకు వైద్య సేవలు చేయడం చాలా సంతృప్తిగా ఉందని తెలిపారు. ముఖ్యంగా ఈ చెంచుగూడెం ను నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి దత్తత తీసుకొని ఇప్పటికే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం, మా ఆస్పత్రి తరపున వారి ఉచితంగా వివిధ జబ్బులకు సంబంధించి పరీక్షలు నిర్వహించి మందులు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జి లింగాపురం గ్రామీణ వైద్యులు షేక్ ఇమ్రాన్ భాష, మహబూబ్ బాషా ఫారెస్ట్ అధికారి ఇండస్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి గారు మా సమస్యలు జర పట్టించుకోరూ...

- హామీలు ఇచ్చారు మరిచిపోయారు
- మా బతుకులు ఇలానే కొనసాగాలా



బండి ఆత్మకూరు సెప్టెంబర్ 24 వార్త సాక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వం వి ఆర్ ఏల సమస్యల పట్ల దృష్టి సారించాలని తమ న్యాయమైన కోరికలను తీర్చాలని బండి ఆత్మకూరు మండల వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు శేషు అన్నారు. ఈ మేరకు గత వారం రోజులుగా రాష్ట్ర వీఆర్ఏల సంఘం ఆదేశాల మేరకు స్థానిక తాసిల్దార్ కార్యాలయం ఎదుట దీక్ష చేపడుతున్నారు. ఈ మద్దతుగా మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజా సమితి రాష్ట్ర అధ్యక్షులు బోయ పులికొండన్న దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్యువగలం పాదయాత్రలో వీఆర్ఏలకు అండగా ఉంటానని తమ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలైనా వీఆర్ఏలను మర్చిపోవడం బాధాకరమన్నారు. జీతాల పెంపు లేక ప్రస్తుత ఖర్చులకు చాలీచాలని జీతాలతో కుటుంబ పోషణ భారమైందని, వారికి జీతాలు పెంచాలని, అలాగే కారుణ్య నియామకాలు అమలు చేయాలని, పదోన్నతులు కల్పించాలని వారి న్యాయమైన కోరికలు తీర్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మహర్షి వాల్మీకి నేతలు రాముడు నాగరాజు గోపాలు మద్దిలేటి ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR

# నిషేధిత వస్తువులు అమ్మారో బెల్టు తీస్తా

– ఎస్సై జగన్మోహన్



బండి ఆత్మకూరు సెప్టెంబర్ 24 వార్త సాక్ష్యం

బండి ఆత్మకూరు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో కిరాణా షాపు యజమానులకు స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్సై జగన్మోహన్ కౌన్సిలింగ్ ఇచ్చారు. నిషేధిత వస్తువులు ఎవరైనా అమ్మిన, అమ్మినట్లు సమాచారం వచ్చిన వారి బెల్టు తీస్తానని కఠినంగా హెచ్చరించారు. ధనార్జనకు పాల్పడి నిషేధిత వస్తువులను అధిక ధరలకు అమ్ముతూ అక్రమాలకు పాల్పడుతున్నట్లు మాకు సమాచారం ఉన్నదని ఇకనుండి అలా ఎవరైనా అక్రమ పనులకు పాల్పడితే వారికి కఠినమైన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. నీ వ్యాపారాలు మీరు సజావుగా చేసుకోండి కానీ ప్రభుత్వం నిషేధించిన వస్తువులు అమ్మినట్లు తెలిస్తే జైలు శిక్ష తప్పదు అన్నారు. తప్పనిసరిగా ప్రతి గ్రామ పంచాయతీలోని కిరాణం షాపులను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని,అందరూ జాగ్రత్తగా మీ వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. డబ్బుకు ఆశపడి ఎవరైనా అక్రమాలకు పాల్పడితే వారి భరతం పడతానని హెచ్చరించారు.

# నేడు జూపాడు బంగ్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

– "వన్ మంత్ – ఫోర్ విజిట్"లో భాగంగా ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం

నంద్యాల, సెప్టెంబర్ 24 వార్త సాక్ష్యం




ప్రజలకు జిల్లా పరిపాలనను మరింత చేరువ చేయడంతో పాటు, స్థానిక సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి వేగవంతంగా పరిష్కరించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న "వన్ మంత్ – ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా నేడు జూపాడు బంగ్లా మండల కేంద్రంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూపాడు బంగ్లా మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలోని ఫంక్షన్ హాల్లో నిర్వహించే ఈ ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమానికి నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్యతో కలిసి జిల్లా కలెక్టర్ హాజరై ప్రజల నుంచి వినతులు, అర్జీలు, ఫిర్యాదులను స్వీకరించనున్నారు. ప్రజలకు సంబంధించిన సంక్షేమం, అభివృద్ధి, రెవెన్యూ, పౌర సేవలు తదితర అంశాలపై వచ్చే వినతులను సంబంధిత శాఖల అధికారులకు అప్పగించి, వాటిపై నిబంధనల మేరకు తక్షణ చర్యలు చేపట్టేలా పర్యవేక్షించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి నేరుగా తీసుకువచ్చేలా ఈ వేదికను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు, జూపాడు బంగ్లా మండల స్థాయి అధికారులు హాజరై ప్రజల నుంచి వినతులను స్వీకరించడంతో పాటు, సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టను న్నారు. జూపాడు బంగ్లా మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కారానికి చర్యలు పొందాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి విజ్ఞప్తి చేశారు.

# బండి ఆత్మకూరు మండలం ప్రత్యేక అధికారిగా లీలావతి

– అభినందనలు తెలిపిన మండల పరిషత్ సిబ్బంది



బండి ఆత్మకూరు సెప్టెంబర్ 24 వార్తా సాక్ష్యం

మండల పరిషత్ అధ్యక్షుల పదవీకాలం ముగియడంతో నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి బండి ఆత్మకూరు మండలం ప్రత్యేక అధికారిగా మహిళ శిశు సంక్షేమ శాఖ పథక సంచాలకులు లీలావతిని నియమించారు. ఈ మేరకు ఆమె గురువారం బండి ఆత్మకూరు మండలం ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆమెకు మండల అభివృద్ధి అధికారి గాయత్రి మండల పరిషత్ సిబ్బంది ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి మాట్లాడుతూ అధికారులను సమన్వయం చేసుకొని మండల అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు. మండలంలోని ఏ గ్రామంలోనైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొని రావాలని తెలిపారు. అందరి సహకారంతో మండల అభివృద్ధికి పాటుపడతానని ఆమె తెలిపారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు... సమన్వయంతో పటిష్ట చర్యలు

– మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత
– మత్తుపదార్థాల నిర్మూలనపై ప్రత్యేక నిఘా
– జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, ఎస్పీ సునీల్ షోరాణ్

నంద్యాల, సెప్టెంబరు 24 వార్త సాక్ష్యం






మహిళలు, చిన్నారుల భద్రత, రహదారి భద్రత, మత్తుపదార్థాల నిర్మూలన అనే మూడు కీలక అంశాలపై శాఖల మధ్య సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టి, క్షేత్రస్థాయిలో వాటి అమలును నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం పట్టణంలోని జిల్లా మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్‌తో కలిసి "త్రిశూల్" కార్యక్రమంపై జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారుల రక్షణ, రోడ్డు ప్రమాదాల నియంత్రణ, గంజాయి మరియు ఇతర మత్తుపదార్థాల నిర్మూలనకు సంబంధించి జిల్లాలో అమలవుతున్న చర్యలు, సాధించిన పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై సమీక్షించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఖాదర్ బాషా, ఐసీడీఎస్ పీడీ లీలావతి దేవి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ శ్రీధర్ రెడ్డి, పోలీసు, రవాణా, ఆర్‌అండ్‌బీ, ఎన్‌హెచ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

**ప్రతి నెలా "త్రిశూల్"పై ఉమ్మడి సమీక్షలు**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మహిళా భద్రత, రోడ్డు భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలనపై జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రతి నెలా ప్రత్యేక ఉమ్మడి సమీక్షలు నిర్వహించాల్సి ఉందన్నారు. ఈ మూడు అంశాలను సమగ్రంగా పర్యవేక్షించేందుకు నిర్వహించే ఉమ్మడి సమీక్షలకు "త్రిశూల్"గా నామకరణం చేసినట్లు తెలిపారు. జిల్లాల నుంచి అందే నివేదికల ఆధారంగా రాష్ట్ర స్థాయిలో సమీక్ష నిర్వహించి తదుపరి కార్యాచరణను నిర్ణయిస్తారని వివరించారు. బాల్య వివాహాల నిర్మూలనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించి బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలని కలెక్టర్ సూచించారు. మహిళలు, బాలికలు, చిన్నారులకు సురక్షిత వాతావరణం కల్పించేందుకు క్షేత్రస్థాయి యంత్రాంగం మరింత చురుగ్గా పనిచేయాలని ఆదేశించారు. ప్రమాదాలకు అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని, బ్లాక్‌స్పాట్‌ల వద్ద లైటింగ్, సూచిక బోర్డులు, రహదారి ఇంజినీరింగ్ తదితర చర్యలను పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. వాహనదారుల్లో రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన పెంచడంతో పాటు, ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసు, విద్య, సంక్షేమ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. మాదక ద్రవ్యాల విక్రయం, వినియోగం, అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారంపై తక్షణమే స్పందించేలా నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలని, యువతను మత్తుపదార్థాలకు దూరంగా ఉంచేందుకు నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

**బ్లాక్‌స్పాట్‌ల పై ప్రత్యేక దృష్టి – ఎస్పీ సునీల్ షోరాణ్**

జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ మాట్లాడుతూ రోడ్డు భద్రత, మహిళలు– చిన్నారుల రక్షణ, మత్తుపదార్థాల నియంత్రణను అత్యంత ప్రాధాన్యతతో తీసుకోవాలని సూచించారు. జిల్లాలో గుర్తించిన ప్రతి బ్లాక్‌స్పాట్‌ను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రమాదాలకు కారణమయ్యే అంశాలను గుర్తించి శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. అవసరమైన చోట రహదారి ఇంజినీరింగ్ మార్పులు, హెచ్చరిక సూచిక బోర్డులు, లైటింగ్, కెమెరాలు తదితర భద్రతా చర్యలను సమన్వయంతో పూర్తి చేయాలని తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుత ఏడాది ఇప్పటివరకు జిల్లాలో రోడ్డు ప్రమాదాలు సుమారు 3 శాతం తగ్గినట్లు ఎస్పీ తెలిపారు. ఈ పురోగతిని కొనసాగిస్తూ ప్రమాదాలను మరింత తగ్గించేందుకు శాఖల వారీగా నిర్దేశించిన చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. శాంతిరాం ఆసుపత్రి పరిసరాల్లోనూ తగినంత లైటింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. తగిన లైటింగ్ లేకపోవడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, భద్రతా ఏర్పాట్లలో నిర్లక్ష్యం ఉండకూడదని ఎన్‌హెచ్ అధికారులకు స్పష్టం చేశారు. రవాణా శాఖ నిర్వహించే వాహన తనిఖీల్లో పోలీసు శాఖతో సమన్వయం పెంచుకోవాలని,ప్రమాదాలకు కారణమయ్యే వాహనాలు, డ్రైవింగ్ ఉల్లంఘనలపై నిఘా పెంచాలని సూచించారు. రోడ్లపై సంచరించే మూగ జీవాల కారణంగా ప్రమాదాలు జరగకుండా వాటికి రేడియం కాలర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

**గ్రామాలు, తండాల్లో మహిళా భద్రతపై విస్తృత అవగాహన**

మహిళల భద్రతకు సంబంధించి పోలీసులు గ్రామాలు, తండాలను సందర్శించి మహిళలు, బాలికలకు అందుబాటులో ఉన్న రక్షణ వ్యవస్థలు, చట్టపరమైన హక్కులు, ఫిర్యాదు విధానాలపై విస్తృత అవగాహన కల్పించాలని ఎస్పీ సూచించారు. పోలీసు స్టేషన్లకు వచ్చే మహిళల పట్ల సిబ్బంది మర్యాదపూర్వకంగా, సానుభూతితో వ్యవహరించి, వారి సమస్యలను ఓపికగా విని పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. ప్రజలతో పోలీసుల పరస్పర వ్యవహారశైలి ప్రజాభిప్రాయంపై ప్రభావం చూపుతుందని, మహిళా భద్రతపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

**మత్తుపదార్థాలపై నిరంతర నిఘా**

పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ మరియు ఇతర మత్తుపదార్థాలకు ఆకర్షితులు కాకుండా నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మత్తుపదార్థాల వినియోగం, అక్రమ రవాణా లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం అందిన వెంటనే చర్యలు తీసుకునేలా నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. మత్తుపదార్థాల గుర్తింపు, నియంత్రణకు సంబంధించి ప్రతి పోలీసు స్టేషన్‌కు అవసరమైన కిట్లు అందుబాటులో ఉంచినట్లు, వాటిని వినియోగిస్తూ ప్రతి ఆదివారం తగిన పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. మత్తుపదార్థాల సేకరణ, వినియోగం లేదా అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం ఉంటే 1972 టోల్‌ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలని ప్రజలకు సూచించారు. మత్తుపదార్థాల నియంత్రణ, మహిళా భద్రతకు సంబంధించి ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంచి ప్రజాభిప్రాయాన్ని మెరుగుపరిచే దిశగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఆత్మకూరు డిఎస్పి ఆర్. రామాంజి నాయక్, ఆళ్లగడ్డ, డీఎస్పీ శ్రీనివాసరావు పోలీస్ శాఖ సిబ్బంది రవాణా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో జరిగే అఖిల భారత రైతు కూలీ జాతీయ మహాసభలను విజయవంతం చేయండి

వెలుగోడు సెప్టెంబర్ 24 వార్త సాక్ష్యం



వెలుగోడు పట్టణంలోని, అఖిలభారత రైతు కూలీ సంఘం కార్యాలయంలో ఈనెల 28,29,30వ తేదీలలో ఖమ్మంలో జరిగే అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకెఎంఎస్)జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని జాతీయ మహాసభల గోడ పత్రికలను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా అఖిలభారత రైతు కూలీ సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షులు వై.నరసింహులు మాట్లాడుతూ ఈనెల ఖమ్మం పట్టణంలో 28.29.30 తేదీలలో జరుగు భారీ బహిరంగ సభను రైతులు కూలీలు ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున పాల్గొని, జయప్రదం చేయాలని ప్రజలను కోరారు. ఈ మహాసభకు జాతీయ నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, ఆసీస్ మీట్టల్, జితేందర్ సింగ్, సుశాంత్ ధర్మల్ పాల్, కే.సెల్వరాజు, నిర్భయ సింగ్, శంభు ప్రసాద్, సబక్ దేవాజిత్, స్టాలిన్ బాబు తదితర జాతీయ నాయకులు హాజరవుతారని ఆయన తెలిపారు నరేంద్ర మోడీ, అమిత్ షా ద్వయం నాయకత్వంలోని, ఆర్ఎస్ఎస్, బిజెపి ప్రభుత్వం దాన్ని డబల్ ఇంజన్ ప్రభుత్వాలు అలాగే ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు భారత రైతాంగంపై కార్పొరేట్ అనుకూల భూస్వాముల దాడుల పరంపరన కొనసాగిస్తున్నాయి. అధికారంలో ఉన్న పాలకవర్గ పార్టీల వాగ్దానాలు ప్రచారానికే పరిమితమ య్యాయి ఈ నిరంతర దాడులను బహిర్గతం చేయడం ప్రజల్లోకి తీసుకెళ్లడం వాటికి వ్యతిరేకంగా పోరాటం మన కర్తవ్యం రైతాంగాన్ని కాపాడటానికి వ్యవసాయాన్ని రక్షించడానికి అడవుల ప్రకృతిని పరిరక్షించడానికి అత్యంత హింసాత్మకమైన క్రూరమైన అత్యంత దుర్మార్గమైన ఆటవిక దాడుల నుంచి దేశాన్ని కాపాడడానికి మనం ఉద్యమించాలన్నారు. ఉపాధి హామీ చట్టం స్థానంలో వికసిత్ భారత్ విబిజీ రామ్ జి పథకం వల్ల రైతు కూలీలకు ద్రోహం తలపెట్టడానికి ప్రయత్నిస్తుందన్నారు. తదితర రైతు కూలీల వ్యతిరేక విధానాల పై మహాసభలో సుదీర్ఘంగా చర్చించి భవిష్యత్ కర్తవ్యం రూపొందించుకొని దశలవారి పోరాటాలకు ఈ మహాసభ వేదిక కాబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కే.అనంతరావు, జిల్లా కోశాధికారి కే.లాలు నాయక్, అఖిల భారత రైతు కూలి సంఘం వెలుగోడు మండల అధ్యక్షులు ఎన్.విజయ్, కార్యదర్శి వడ్ల హుస్సేన్ సాహెబ్, శివమ్మ, కళ్యాణి, లోకేశ్వరి బాయి, లక్ష్మీబాయి, నారాయణమ్మ, అత్తరు న్నిసా, పక్కిరా, మదార్ బి, పార్వతమ్మ. వెంకటేశ్వరి, హుస్సేన్ బి తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలకు బస్టాండ్ ప్రాంతం జలమయం

వార్త సాక్ష్యం సెప్టెంబర్ 24– వెలుగోడు :



వెలుగోడు మండలంలో ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా వాగులు,వంకలు పొంగిపొర్లి లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. మండలంలో 43.2 మి మీ వర్షపాతం నమోదయింది. వేల్పనూరు రస్తాలో మంచినీళ్ల వాగు పొంగిపొర్లి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తెలుగుగంగ పంట కాలువకు వరద ప్రవాహం పెరుగుతుంది. అదేవిధంగా రాళ్లవాగుకు చేరుతున్న వరద నీటి ప్రవాహం కూడా అధికంగా ఉండటంతో వెలుగోడు గ్రామంలోని ఆర్టీసీ బస్టాండ్, ఆర్ అండ్ బి రోడ్డు మరియు పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం వెలుగోడులో తెలుగుగంగ పంట కాలువ పునర్నిర్మాణం ,అభివృద్ధి పనుల్లో భాగంగా చేపట్టిన నిర్మాణ పనులు రాళ్లవాగు మరియు ఆర్ బి రోడ్డు స్థాయి కంటే సుమారు ఒక మీటరు ఎత్తులో ఉండటంతో, గ్రామ పరిసర ప్రాంతాల్లో కురిసే వర్షపు నీరు సహజంగా వెళ్లే మార్గంలేదు. దీని కారణంగా ఆర్టీసీ బస్టాండ్ నుండి సీపీ నగర్ వరకు ఉన్న ప్రాంతాల్లో వరద నీరు చేరే పరిస్థితి ఏర్పడుతుండటంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. భవిష్యత్తులో భారీ వర్షాలు కురిసినప్పుడు ప్రజలకు, రహదారి ప్రయాణికులకు మరియు పరిసర ప్రాంతాలకు ఎటువంటి నష్టం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సిపిఎం అవాజ్ కమిటీ జిల్లా నాయకులు మహమ్మద్ రఫీ గ్రామకార్యదర్శి మహమ్మద్ ఇర్ఫాన్‌కు, ఎంపిడిఓ మురారికి గురువారం వినతిపత్రం అందజేశారు.

VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# శ్రీ అన్న చిరుధాన్యాల సాగుతో రైతులకు లాభదాయకమైన ఆదాయం

- ఆరోగ్యకరమైన ఆహారంలో చిరుధాన్యాలకు ప్రత్యేక స్థానం
- చిరుధాన్యాలు ప్రాసెసింగ్ యూనిట్లకు ప్రభుత్వ ప్రోత్సాహం
- జిల్లాలో చిరుధాన్యాల వినియోగాన్ని మరింత ప్రోత్సాహం అందిస్తాం
- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా
- చిరుధాన్యాల వినియోగంతో ఆరోగ్యకరమైన జీవనం
- జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు

నంద్యాల, సెప్టెంబర్ 24 వార్త సాక్ష్యం








ఆరోగ్యకరమైన ఆహారంలో చిరుధాన్యాలకు ప్రత్యేక స్థానం ఉందని, చిరుధాన్యాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందనీ జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా తెలిపారు. ఈ కార్యక్రమానికి ముందుగా జిల్లా కలెక్టర్ చిరుధాన్యాల మేళాలో ఏర్పాటు చేసిన స్టాల్స్ ను పరిశీలించి వారు తయారీ విధానాన్ని, చిరుధాన్యాల వల్ల లాభాలను ప్రత్యక్షంగా రైతులను ఉత్పత్తిదారులను అడిగి తెలుసుకున్నారు. గురువారం నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ అండ్ న్యూట్రిషన్ మిషన్ లో భాగంగా ూ+=ూ హాల్ నందు నంద్యాల జిల్లా కేంద్రంలో జిల్లాస్థాయి చిరుధాన్యాల మేళా, శ్రీ అన్న సామర్థ్య పెంపు శిక్షణ మరియు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ. చిరుధాన్యాలు పోషక విలువలు కలిగిన సంప్రదాయ ఆహార పంటలని, మారుతున్న జీవనశైలికి అనుగుణంగా ప్రజలు ఆరోగ్యం, పోషకాహారంపై ఎక్కువగా దృష్టి సారిస్తున్న నేపథ్యంలో చిరుధాన్యాల వినియోగాన్ని మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.

**చిరుధాన్యాలకు శ్రీ అన్నగా ప్రత్యేక గుర్తింపు**

శ్రీ అనేది సిరి సంపదలు, శ్రేయస్సు, ఆరోగ్యానికి ప్రతీకగా భావిస్తామని, పోషకాలు సమృద్ధిగా ఉండే చిరుధాన్యాలను అందుకే శ్రీ అన్నగా పిలుస్తున్నట్లు తెలిపారు. చిరుధాన్యాల వినియోగం ద్వారా ఆరోగ్య కరమైన ఆహారపు అలవాట్లను పెంపొందించవచ్చన్నారు. ప్రస్తుతం ఖరీఫ్‌లో సుమారు 70 వేల హెక్టార్లలో వరి, మరో 70 వేల హెక్టార్లలో జొన్న, మొక్కజొన్న వంటి పంటలు సాగు చేస్తున్నారని తెలిపారు. పంటల వైవిధ్యాన్ని పెంచుతూ వరి సాగు విస్తీర్ణాన్ని క్రమంగా తగ్గించి, దాని స్థానంలో చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, కంది, మినుము, పెసరతో పాటు నూనెగింజల సాగును ప్రోత్సహించాలని అన్నారు. దేశీయంగా నూనెగింజల ఉత్పత్తిని పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా జిల్లాలో తొలిసారిగా ఆయిల్ పామ్ సాగుతో పాటు వేరుశనగ, నువ్వుల సాగును ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.

**పోషకాహార లోపం నివారణకు చిరుధాన్యాలు**

జిల్లాలో చిన్నారులు, గర్భిణీలలో పోషకాహార లోపం, వంటి సమస్యలను తగ్గించేందుకు గత రెండేళ్లుగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. చిరుధాన్యాలతో కూడిన పోషకాహారం చిన్నారులు, గర్భిణీలలో రక్త హీనతను తగ్గించడంతో పాటు శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదపడుతుందనారు.

**ప్రాసెసింగ్, బ్రాండింగ్‌తో మెరుగైన మార్కెట్**

చిరుధాన్యాలతో తయారు చేసే ఉత్పత్తులకు నాణ్యతతో పాటు ఆకర్షణీయమైన ప్యాకింగ్, బ్రాండింగ్, ప్రాసెసింగ్ కల్పించడం ద్వారా మార్కెట్ విలువను పెంచుకోవచ్చని తెలిపారు. స్థానిక మార్కెట్లతో పాటు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లకు "శ్రీ అన్న" ఉత్పత్తులను తీసుకెళ్లేందుకు అవసరమైన అనుమతులు, జిల్లా యంత్రాంగం తరపున తగిన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం బయో రిసోర్స్ సెంటర్ల ద్వారా రైతులు,మహిళలకు చిరుధాన్యాల సాగు, ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.

**ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి**

భూసారం పెంపు, భూమిలో తేమను కాపాడటం, ఉష్ణోగ్రతల ప్రభావాన్ని తగ్గించడం కోసం రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, జీవ ఎరువులు, జీవామృతం, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని సూచించారు.జిల్లాలో సుమారు 50 వేల మంది రైతులు 50 వేల ఎకరాల్లో ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ (ప్రీవీణా) పద్ధతిని విజయవంతంగా చేపట్టినట్లు తెలిపారు. రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు అందించే సాంకేతిక సూచనలు పాటిస్తూ, పంటల వైవిధ్యాన్ని పెంచి చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. శ్రీ అన్న సాగు, ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తుల ద్వారా రైతులు, మహిళా స్వయం సహాయక సంఘాలు మెరుగైన ఆదాయ అవకాశాలను పొందేలా జిల్లా యంత్రాంగం అవసరమైన సహకారం అందిస్తుందని తెలిపారు.

**ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు 35 శాతం సబ్సిడీ**

కేంద్ర ప్రభుత్వ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ప్రోత్సాహక పథకం కింద చిరుధాన్యాలు, ఇతర ఆహార ఉత్పత్తుల శుద్ధి యూనిట్ల ఏర్పాటుకు 35 శాతం సబ్సిడీ సదుపాయం ఉందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

**మూడు నెలల్లో 48 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు**

గత మూడు నెలల కాలంలో జిల్లా యంత్రాంగం, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ , బ్యాంకర్ల సమన్వయంతో జిల్లాలో 48 ఆహార శుద్ధి యూనిట్లు ప్రారంభమైనట్లు తెలిపారు.

**ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త**

చిన్న తరహా పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందడంతో పాటు, ఇతరులకు కూడా ఉపాధి కల్పించే స్థాయికి యువత, మహిళలు, కుటుంబాలు ఎదగాలని అధికారులు సూచించారు. ఒక కుటుంబం ఒక పారిశ్రామికవేత్త" అనే ఆలోచనను ప్రోత్సహించడం ద్వారా కుటుంబ ఆదాయం పెరగడంతో పాటు స్థానికంగా మరిన్ని ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ.. చిరుధాన్యాల వినియోగాన్ని పెంచడంతో పాటు వాటి ఆధారంగా విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, మార్కెటింగ్ రంగాల్లో రైతులు, మహిళలు, యువత మరింతగా ముందుకు రావాలని తెలిపారు. చిరుధాన్యాలు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి, ఆదాయ అవకాశాలను పెంచేందుకు దోహదపడతాయని తెలిపారు.జొన్న, కొర్రలు, అరికలు, ఊదలు, సజ్జలు, రాగులు వంటి చిరుధాన్యాలు వివిధ రకాల పోషక విలువలను కలిగి ఉంటాయన్నారు. RARS 1930 సంవత్సరం నుంచి జొన్నపై పరిశోధనలు కొనసాగుతున్నాయని, రైతుల అవసరాలకు అనుగుణంగా అధిక దిగుబడి, తెగుళ్లను తట్టుకునే, స్వల్పకాలిక మరియు పోషక విలువలు కలిగిన వివిధ రకాల చిరుధాన్య విత్తనాలను అభివృద్ధి చేసి విడుదల చేయడం జరిగిందన్నారు.రైతులకు మరింత మెరుగైన ఆదాయం అందాలంటే గ్రామస్థాయిలోనే విలువ ఆధారిత కేంద్రాలను ఏర్పాటు చేయడం అవసరమని తెలిపారు. రైతులు స్వయంగా లేదా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, మహిళా సంఘాలు, స్థానిక పారిశ్రామికవేత్తల భాగస్వామ్యంతో ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్‌పై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు ఫ్రంట్‌లైన్ డెమోన్‌స్ట్రేషన్లు, కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా శిక్షణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. చిరుధాన్యాల సాగు, విత్తన ఎంపిక, ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్ వంటి అంశాల్లో రైతులకు అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఎఆర్ఎస్ అసోసియేట్ డైరెక్టర్ జయలక్ష్మి, నంద్యాల డిడిఎ ఆర్.గంగాధర్ రావు, మెప్మా పిడి వెంకటదాసు, డిఆర్డిఎ పిడి శ్రీధర్ రెడ్డి, డిపిఎం వై.శ్రీనివాసులు, నాబార్డు డిడిఎం కార్తీక్, ఎల్డిఎం అయ్యపురెడ్డి, ఏపిఎఫ్పిఎస్ జోనల్ మేనేజర్ రవికిరణ్, రైతులు , స్వయం సహాయక సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## భక్తుల ద్వారా శ్రీశైల దేవస్థానానికి రూ. 4,56,49,063/-లు రాబడి





శ్రీశైలం దేవస్థానం సెప్టెంబర్ 24 వార్తా సాక్ష్యం

హుండీల లెక్కింపు ద్వారా దేవస్థానానికి రూ.4,56,49,063/-లు నగదు రాబడిగా లభించింది. కాగా ఈ హుండీల రాబడిని భక్తులు గత 29 రోజులలో సమర్పించడం జరిగింది. అలాగే ఈ హుండీలో 79 గ్రాముల 600 మిల్లీగ్రాముల బంగారం, 3 కేజీల 760 గ్రాముల వెండి లభించాయి. అదేవిధంగా 823 - యుఎస్ఏ డాలర్లు, 515-యు.ఏ.ఇ దిర్హామ్స్, 93 - సింగపూర్ డాలర్లు, 10 - ఇంగ్లాండు పౌండ్స్, 5 - కువైట్‌దినార్లు, 45 - కెనడా డాలర్లు, 50 - ఆస్ట్రేలియా డాలర్లు, 20 - సౌదీరియాల్స్, 5 - ఓమన్ రియాల్స్, మొదలైనవి ఈ హుండీల లెక్కింపులో లభించాయి. పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సీసీ కెమెరాల నిఘాతో ఈ లెక్కింపును చేపట్టడం జరిగింది. ఈ హుండీల లెక్కింపును ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు పర్యవేక్షించారు. అలాగే ధర్మకర్తల మండలి సభ్యులు శ్రీమతి కోడె కాంతివర్ధిని, శ్రీ మేడా మురళీధర్, ధర్మకర్తల మండలి ప్రత్యేక ఆహ్వానితులు శ్రీ కట్టా సుధాకర్‌రెడ్డిలు లెక్కింపు ప్రక్రియను పరిశీలించారు. అదేవిధంగా హుండీల లెక్కింపులో పలువిభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు, దేవస్థానం సిబ్బంది, శివసేవకులు పాల్గొన్నారు.

## వెలుగోడులో స్వచ్ఛత నీరులో భాగంగా 2 రోజు

వార్త సాక్ష్యం సెప్టెంబర్ 24 వెలుగోడు :



వెలుగోడులోని పలు కాలనీల్లో స్వచ్ఛత నీరులో భాగంగా 2 రోజు తాగు నీరు కూడా లేదు. తల పైన గంగమ ఉండి కూడా సుక్క నీరు త్రాగడానికి కూడా నోచుకోని వెలుగోడు ప్రజలు గత 2 రోజులుగా పంప్ హౌస్ రిపేరు లో ఉండి కూడా పటించుకొని అధికారులు. తీవ్ర ఇబ్బందులో వెలుగోడు గ్రామ ప్రజలు. కనీసం సాగు నీరు వద్దు త్రాగడానికి నీరు ఇవ్వండి అని అడుగుతున్న ప్రజలు.

## వెలుగోడు లో హిందీ దివస్ వేడుకలు.

వార్త సాక్ష్యం సెప్టెంబర్ 24 వెలుగోడు :

వెలుగోడు పట్టణ లిటిల్ ఏంజెల్స్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో హిందీ దివస్ వారోత్సవాల్లో భాగంగా హిందీ దివస్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలు పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎం.ఎఫ్. ఇమ్మానియేల్, హిందీ ఉపాధ్యాయులు అప్పియ ప్రశాంత, షేక్ షావలి, సలీం, నుస్రత్ ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హిందీలో వ్యాసరచన పోటీలు నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ఉపాధ్యాయుల చేతుల మీదుగా అందజే సారు మాతృభాషతో పాటు హిందీ భాష పరిజ్ఞానం ఉంటే భారతదేశంలో విద్య, ఉపాధి, వ్యాపార, రాజకీయ, విహారయాత్రల సమయంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కావున విద్యార్థులందరూ పదవ తరగతి పూర్తి చేసే సమయానికి తప్పనిసరిగా హిందీ పరిజ్ఞానాన్ని పొంది ఉండాలి" అని సూచించారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనిల్, నూరుల్ అమీన్, నాయక్, వెంకటేష్, రవి, శ్యామల, రాధిక, ప్రసన్న, ఆబిదా తదితర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బోయరేవులలో రక్తదాన శిబిరం.

వార్త సాక్ష్యం సెప్టెంబర్ 24 వెలుగోడు :



గర్భిణీ స్త్రీలకు ఆపద సమయంలో ఆదుకొనుటకు రక్తము ఎంతో అవసర మని , రెండు జీవితాలను ఆదుకోవడం ఎంతో అభినందనీయం. వెలుగోడు మండలంలోని బోయరేవుల గ్రామంలో అకాల మరణం చెందిన మృతుడు మురళి జ్ఞాపకార్థము కుటుంబ సభ్యులు , స్నేహితులు కలిసి తన నివాసంలో గురువారం రక్తదాన శిబిరము నిర్వహించారు. ఈ క్యాంపును నంద్యాల బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు అచ్చు ఆధ్వర్యంలో నిర్వహించారు. మురళి మిత్రులు , బంధువులు సుమారు 30 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు మిత్రులు సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీశైల దేవస్థానంలో ఆధ్యాత్మిక సాధకులకు సముచిత గౌరవం





శ్రీశైలం దేవస్థానం సెప్టెంబర్ 24 వార్త సాక్ష్యం

దేవస్థానంలో ఆధ్యాత్మిక సాధకులకు, సన్యాసులకు యతులకు దేవస్థానం గౌరవ ప్రదమైన స్థానాన్ని కల్పించడం జరుగుతోందని ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్ నాయుడు అన్నారు. ఆధ్యాత్మిక సాధకుల నివాసానికి వీలుగా టూరిస్ట్ బస్టాండు వద్ద గల దేవస్థాన షెడ్డును వారికి ఉచితముగా కేటాయించినట్లుగా ఆయన పేర్కొన్నారు. ఆధ్యాత్మిక సాధకులు దేవస్థానం కార్యాలయాన్ని సంప్రదిస్తే అవకాశం మేరకు వీరికి శ్రీస్వామి అమ్మవార్ల ప్రత్యేక దర్శనాలను కూడా కల్పిస్తామని ఆయన అన్నారు. క్షేత్రంలో నియమిత కాలం పాటు ధ్యానం, జపం, పారాయణలు చేసుకొనే సాధకులకు దేవస్థానం తగు సహాయ సహకారాలను అందిస్తుందని తెలియజేశారు. ఇంకా వారు మాట్లాడుతూ శ్రీశైలం అనాది కేత్రంగా ప్రసిద్ధమైందన్నారు. సిద్ధ క్షేత్రమైన శ్రీశైలంలో పలువురు ఆధ్యాత్మిక సాధనకు, ధ్యానానికి, జపపారాయణలకు ఎంతో ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతున్న దన్నారు.ఇంకా ధర్మకర్తల మండలి అధ్యక్షులు వారు మాట్లాడుతూ ఈరోజున ఏపి సాధు పరిషత్ గౌరవ అధ్యక్షులు శ్రీ అట్లూరి నారాయణరావు, పలువురు సాధువులు, ఆధ్యాత్మిక సాధకులు కలిసి కార్యాలయములో తమతో సమావేశం అవ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వారు పలు ధార్మిక అంశాలను తమతో చర్చించారన్నారు. వారి సూచనలు, సలహాలకు అనుగుణంగా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.

# బిజినెస్

## మళ్లీ అదానీనే నం.1



దేశంలో అత్యంత సంపన్నులుగా మళ్లీ అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ, ఆయన కుటుంబం నిలిచింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ కుటుంబాన్ని వెనక్కి నెట్టి మొదటి స్థానంలో నిలిచింది. ఎం3ఎం హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2026 ప్రకారం.. అదానీ ఆయన కుటుం బ సంపద 13 శాతం పెరిగి రూ.9.23 లక్షల కోట్లకు (9,600 కోట్ల డాలర్లు) చేరుకుంది. ముకేశ్ అంబానీ ఆయన కుటుంబం సంపద మాత్రం 10 శాతం తగ్గి రూ.8.63 లక్షల కోట్లకు పరిమితమైంది. వీరి మధ్య సంపదలో వ్యత్యాసం రూ.59,400 కోట్లు గా ఉంది. ఆర్సెలార్ మిట్టల్‌కు చెందిన లక్ష్మీ నివాస్ మిట్టల్, ఆయన కుటుంబం మూడో స్థానంలో నిలిచింది. వీరి సంపద దాదాపు రెండింతలు పెరిగి రూ.3.39 లక్షల కోట్లకు చేరుకుంది. వ్యాక్సిన్ తయారీ సంస్థ సీరమ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన సైరస్ పూనావాలా ఆయన కుటుంబం నాలుగో స్థానంలో నిలువగా.. హెచ్‌సీఎల్‌కు చెందిన రోష్ని నాడార్ మల్హోత్రా, ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార్ మంగళం బిర్లా, సన్ ఫార్మాసూటికల్స్ దిలీప్ సంఘ్వీ, విప్రో అజీమ్ ప్రేమ్‌జీలు తర్వాతి స్థానాల్లో ఉన్నారు. వేదాంత అనిల్ అగర్వాల్ ఆయన కుటుంబం రూ.2.08 లక్షల కోట్లతో తొమ్మిదో స్థానానికి ఎగబాకింది. టొరెంట్ ఫార్మా సమీర్ మెహతా ఆయన కుటుంబం పదో స్థానంలో నిలిచింది. గౌతమ్ అదానీ 2022లో ముకేష్ అంబానీని దాటేసి మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. 2023లో మళ్లీ వెనుకపడ్డారు. 2024లో తిరిగి మొదటి స్థానాన్ని కైవసం చేసుకోగా 2025లో మళ్లీ ఆ స్థానాన్ని చేజార్చుకున్నారు. తాజాగా మళ్లీ మొదటి స్థానాన్ని దక్కించుకున్నారు.

## దేశవ్యాప్తంగా ఫోన్‌పే భారీ విస్తరణ.. 20,000 ఉద్యోగాలు

ప్రముఖ డిజిటల్ చెల్లింపుల సంస్థ 'ఫోన్‌పే' భారత్‌లో తన కార్యకలాపాలను భారీ స్థాయిలో విస్తరించేందుకు సిద్ధమైంది. దేశంలోని మారుమూల గ్రామాలు, చిన్న పట్టణాలకు కూడా డిజిటల్ చెల్లింపుల సేవలను తీసుకెళ్లడమే లక్ష్యంగా ఒక బృహత్ ప్రణాళికను ప్రకటించింది. ఈ విస్తరణలో భాగంగా రాబోయే ఏడాది కాలంలో 20,000 మందికి పైగా ఫ్రంట్‌లైన్ సేల్స్ సిబ్బందిని నేరుగా నియమించుకోనున్నట్లు గురువారం వెల్లడించింది. ఈ ప్రణాళిక కింద, వచ్చే 12 నెలల్లో దేశవ్యాప్తంగా 50 లక్షలకు పైగా పేమెంట్ డివైజ్‌లను ఏర్పాటు చేయాలని ఫోన్‌పే లక్ష్యంగా పెట్టుకుంది. వీటిలో స్మార్ట్‌స్పీకర్‌లు, పీఓఎస్ మెషీన్లు వంటివి ఉంటాయి. ముఖ్యంగా ఈ పరికరాల్లో సుమారు 50 శాతం, అంటే 25 లక్షల డివైజ్‌లను టైర్-6 పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని వ్యాపారులకు అందించడంపై దృష్టి సారించనుంది. తద్వారా డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను అట్టడుగు స్థాయికి తీసుకెళ్లాలని భావిస్తోంది. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) ఫ్రేమ్‌వర్క్, ఫోన్‌పే విస్తరణ ప్రణాళికలకు ఊతమిచ్చింది. ఈ విధానం వల్ల, మర్చంట్ల విస్తరణపై దీర్ఘకాలిక పెట్టుబడులు పెట్టేందుకు కంపెనీకి వెసులుబాటు కలిగింది. ఎండీఆర్ ద్వారా వసూలైన మొత్తంలో 5 శాతాన్ని ప్రత్యేక నిధిగా కేటాయించి, దానిని చిన్న వ్యాపారుల నెట్‌వర్క్‌ను పెంచేందుకు వినియోగిస్తున్నారు. అలాగే, గతేడాది ప్రవేశపెట్టిన నూతన కార్మిక చట్టాలు (లేబర్ కోడ్స్) కూడా నియామక ప్రక్రియను వేగవంతం చేశాయని, పెద్ద సంఖ్యలో ఉద్యోగులను సులభంగా నియమించుకునేందుకు




దోహదపడ్డాయని కంపెనీ పేర్కొంది. ఈ విస్తరణ ద్వారా దేశంలోని లక్షలాది మంది చిరు వ్యాపారులను అధికారిక ఆర్థిక వ్యవస్థ పరిధిలోకి తీసుకురావాలని ఫోన్‌పే ఆశిస్తోంది. పెద్ద సంఖ్యలో సిబ్బందిని నియమించుకోవడం వల్ల చిన్న పట్టణాలు, గ్రామాల్లోని వ్యాపారులను నేరుగా కలిసి, వారిని డిజిటల్ చెల్లింపుల వేదికపైకి తీసుకురావడం, కేవైసీ పూర్తి చేయడం, పేమెంట్ పరికరాలను అమర్చడం, వారికి నిరంతరం సాంకేతిక సహకారం అందించడం సులభతరం అవుతుంది. డిజిటల్ లావాదేవీలతో చురుగ్గా ఉండి, కేవైసీ పూర్తి చేసుకున్న వ్యాపారులు భవిష్యత్తులో బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల నుంచి సులభంగా రుణాలు పొందేందుకు అర్హత సాధించే అవకాశం ఉంటుంది. ఇది దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి దోహదపడుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## చిన్న వ్యాపారులకు ఊరట.. యూపీఐ కొత్త ఛార్జీల పై ఎన్‌పీసీఐ కీలక ప్రకటన

యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా రూ. 2,000కు మించిన లావాదేవీలపై కొత్తగా విధించిన మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) దేశంలోని మెజారిటీ వ్యాపారులపై ఎలాంటి ప్రభావం చూపదని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) స్పష్టం చేసింది. డిజిటల్ చెల్లింపులు స్వీకరించే వ్యాపారుల్లో దాదాపు 75 శాతం మందికి ఈ కొత్త నిబంధన వర్తించదని ఎన్‌పీసీఐ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ దిలీప్ అస్బే తెలిపారు. ఎస్‌బీఐ బ్యాంకింగ్ అండ్ ఎకనామిక్ కాంక్లేవ్‌లో ఆయన ఈ కీలక విషయాలను వెల్లడించారు. భారత్‌లో ప్రస్తుతం 60 మిలియన్లకు పైగా ప్రత్యేక యూపీఐ మర్చంట్లు ఉన్నారని, వారిలో 75 శాతం మంది ఇప్పటి వరకు ఒక్కసారి కూడా రూ. 2,000 కంటే ఎక్కువ విలువైన లావాదేవీని నమోదు చేయలేదని దిలీప్ అస్బే వివరించారు. ఈ కారణంగా ఎండీఆర్ విధానం వల్ల అత్యధిక శాతం మంది చిన్న, మధ్య తరహా వ్యాపారులకు ఎటువంటి ఇబ్బంది ఉండదని ఆయన పేర్కొన్నారు. ఈ ఎండీఆర్ భారం అధికంగా పెద్ద వ్యాపార సంస్థలపైనే పడుతుందని అస్బే తెలిపారు. మొత్తం ఎండీఆర్ విలువలో దాదాపు 80 శాతం... వార్షికంగా రూ. 1,000 కోట్ల కంటే ఎక్కువ స్థూల సరుకుల విలువ (జీఎంవీ) కలిగిన వ్యాపారుల నుంచి వస్తుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. మిగిలిన మొత్తంలో దాదాపు సగం... రూ. 1 కోటి కంటే ఎక్కువ వార్షిక జీఎంవీ ఉన్న వ్యాపారాల నుంచి వస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ పెద్ద వ్యాపారుల్లో చాలామంది ఇప్పటికే క్రెడిట్ కార్డ్ చెల్లింపులను అంగీకరిస్తున్నారని, వారికి




ఇలాంటి లావాదేవీ ఛార్జీల గురించి అవగాహన ఉందని అస్బే గుర్తు చేశారు. అందువల్ల వారు ఈ అదనపు భారాన్ని కస్టమర్లపై మోపే అవకాశం లేదని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నట్లు తెలిపారు. అయితే, మొత్తం వ్యాపారుల విలువలో దాదాపు 10 శాతం మంది ఈ ఎండీఆర్ భారాన్ని వినియోగదారులకు బదిలీ చేయడానికి ప్రయత్నించే ప్రమాదం ఉందని ఆయన అంగీకరించారు. అయినప్పటికీ, అలాంటి ఛార్జీలు కస్టమర్లపై పడకుండా బ్యాంకులు, పేమెంట్ అగ్రిగేటర్లు, ఇతర భాగస్వాములతో కలిసి ఎన్‌పీసీఐ పర్యవేక్షిస్తుందని హామీ ఇచ్చారు.

## రోహిత్‌తో నా బంధం ప్రత్యేకం..

టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్.. సీనియర్ ఆటగాడు, మాజీ కెప్టెన్ రోహిత్ శర్మతో తనకున్న బంధంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తమ మధ్య ఉన్నది కేవలం కెప్టెన్-కోచ్ సంబంధం మాత్రమే కాదని, అంతకు మించిన బలమైన అవగాహన ఉందని స్పష్టం చేశాడు. ఆదివారం నుంచి తిరువనంతపురంలో వెస్టిండీస్‌తో ప్రారంభం కానున్న వన్డే సిరీస్ నేపథ్యంలో గంభీర్ జియోస్టార్‌తో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశాడు. "రోహిత్‌తో నా బంధం ఈనాటిది కాదు. అతను జట్టులోకి వచ్చినప్పుడు నేను సీనియర్ ఆటగాడిని. అప్పటి నుంచే మా మధ్య మంచి సంబంధం ఉంది. ఒకరి ఆలోచనా విధానం మరొకరికి బాగా తెలుసు. ఇది మైదానంలో మా పనిని చాలా సులువు చేస్తుంది. కొన్నిసార్లు నా ఆలోచన, కెప్టెన్ ఆలోచన వేర్వేరుగా ఉండొచ్చు. కానీ, అంతిమంగా జట్టు ప్రయోజనాలే ముఖ్యమని ఇద్దరం నమ్ముతాం. అదే జరిగితే అంతకంటే మంచి విషయం మరొకటి ఉండదు" అని గంభీర్ వివరించాడు. 2024 జులైలో తాను హెడ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి పనిచేసిన నలుగురు కెప్టెన్లను గంభీర్ ప్రశంసించాడు. "నేను రోహిత్, సూర్యకుమార్ యాదవ్, శ్రేయస్ అయ్యర్, శుభ్‌మన్ గిల్‌తో కలిసి పనిచేశాను. ఈ నలుగురిలో నేను గమనించిన ముఖ్యమైన విషయం 'జట్టుకే తొలి ప్రాధాన్యం' ఇవ్వడం. తమకంటే జట్టు ప్రయోజనాలే ముఖ్యమని భావించే కెప్టెన్లతో పనిచేయడం నా అదృష్టం" అని అన్నాడు. కెప్టెన్ల గురించి గౌతీ విడివిడిగా మాట్లాడుతూ.. "శ్రేయస్‌లో నాయకత్వ లక్షణాలను నేను 2018లోనే గుర్తించాను. అప్పుడు ఢిల్లీ కెప్టెన్సీని అతనికి అప్పగించాను. ఇప్పుడు మళ్లీ అతనితో పనిచేసే అవకాశం వచ్చింది. ఇక, శుభ్‌మన్ గిల్ చాలా యువకుడు. ఇంగ్లండ్ లాంటి కఠినమైన పర్యటనలో ఐదు టెస్టులకు కెప్టెన్సీ ఇవ్వడమంటే, ఒకరిని లోతైన సముద్రంలోకి తోసేయడం లాంటిది. కానీ, గిల్ ఆ సవాలును అద్భుతంగా స్వీకరించి, ఈత కొట్టి బయట పడ్డాడు. రాబోయే సంవత్సరాల్లో అతనిలో అత్యుత్తమ ఆటను మనం చూస్తాం" అని గంభీర్ విశ్వాసం వ్యక్తం చేశాడు. ఆలోచనలు, వ్యూహాలు మారొచ్చని, కానీ జట్టు పట్ల కెప్టెన్ల ఉద్దేశం సరిగ్గా ఉన్నంత కాలం సహాయక సిబ్బందికి పని సులువు అవుతుందని పేర్కొన్నాడు.

**పనిచేసిన కెప్టెన్లందరిదీ ఒకే మాట**



## క్రికెటర్ల గాయాల పై అశ్విన్ సంచలన వ్యాఖ్యలు..

భారత క్రికెటర్ల గాయాలు, రిహాబిలిటేషన్ విషయంలో బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీఓఈ)పై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. దీనిపై మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ఆటగాళ్ల గాయాల నిర్వహణలో జవాబు దారీతనం అవసరమని స్పష్టం చేశాడు. గాయాల విషయంలో సీఓఈ వ్యవస్థను మరింత సమర్థంగా పనిచేసేలా చూడాలని అభిప్రాయ పడ్డాడు. తన యూట్యూబ్ ఛానల్‌లో అశ్విన్ మాట్లాడుతూ.. మూడు ఫార్మాట్లకు వేర్వేరు జట్లను సిద్ధం చేయాల్సిన సమయం వచ్చిందన్నాడు. అవసరాన్ని బట్టి ఒకరిద్దరు ఆటగాళ్లు మాత్రమే మూడు జట్లలో ఉండొచ్చని చెప్పాడు. అదే సమయంలో ఆటగాళ్ల గాయాల నిర్వహణకు ఎవరు బాధ్యత వహిస్తారనే అంశంపై స్పష్టత ఉండాలని పేర్కొన్నాడు. తమిళనాడు ప్రీమియర్ లీగ్ కోసం అనుమతి కోరినా వరుణ్ చక్రవర్తిని సీఓఈ విడుదల చేయలేదని అశ్విన్ ఉదాహరణగా చెప్పాడు. నెల రోజుల్లో తిరిగి రావాల్సిన ఆటగాడు రెండు, మూడు నెలలు అక్కడే ఉన్నాడని తెలిపాడు. ఇటీవల బుమ్రా శ్రీలంక టెస్టు సిరీస్‌కు దూరం కావడం కూడా సీఓఈ, జాతీయ సెలెక్షన్ కమిటీ మధ్య సమాచార లోపం పై ప్రశ్నలు లేవనెత్తింది. మరోవైపు ఆటగాళ్ల గాయాలు పెరుగుతున్న నేపథ్యంలో బీసీసీఐ కొత్త స్పోర్ట్స్ సైన్స్ అండ్ మెడిసిన్ హెడ్ కోసం దరఖాస్తులు ఆహ్వానించింది. ఆటగాళ్ల విషయంలో శిక్షణ విధానం కూడా కీలకమేనని అశ్విన్ చెప్పాడు. తనకు 2015లో ఒలింపిక్ లిఫ్టింగ్ కారణంగానే సైడ్ స్ట్రెయిన్ వచ్చిందని గుర్తుచేసుకున్నాడు.



# స్పోర్ట్స్

## తండ్రి పేరుతో వచ్చే ఒత్తిడిని పట్టించుకోను..

### నా ఆట నేను ఆడతా: సెహ్వాగ్ కుమారుడు



భారత క్రికెట్‌లో డాషింగ్ ఓపెనర్‌గా పేరొందిన వీరేంద్ర సెహ్వాగ్ వారసుడు ఇప్పుడు మైదానంలోకి అడుగుపెట్టాడు. తండ్రి వారసత్వాన్ని అందిపుచ్చుకుంటూ ఆయన పెద్ద కుమారుడు 18 ఏళ్ల ఆర్యవీర్ సెహ్వాగ్ క్రికెట్‌లో తన ప్రయాణాన్ని ప్రారంభించాడు. ఇటీవలే భారత అండర్-19 జట్టు తరఫున ఆస్ట్రేలియాతో జరిగిన యూత్ వన్డే సిరీస్‌లో ఆర్యవీర్ అరంగేట్రం చేశాడు. ఈ సిరీస్‌లో మూడు మ్యాచ్‌లు ఆడి 28, 47, 34 పరుగులు సాధించాడు. అంతకుముందు ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లోనూ వెస్ట్ ఢిల్లీ లయన్స్ తరఫున ప్రాతినిధ్యం వహించాడు. ఈ సందర్భంగా ఓ క్రీడా ఛానెల్‌తో మాట్లాడిన ఆర్యవీర్, తన ప్రదర్శనపై కొంత నిరాశ వ్యక్తం చేశాడు. "మూడు మ్యాచ్‌లలోనూ మంచి ఆరంభాలు లభించినా, వాటిని భారీ స్కోర్లుగా మలచలేకపోయాను. చివరి గేమ్‌లో కూడా కుదురుకున్నాక సిక్స్ కొట్టే ప్రయత్నంలో ఔటయ్యాను. ఇది నన్ను నిరాశపరిచింది. క్రికెట్‌లో పేరు సంపాదించాలంటే భారీ పరుగులు చేయడం చాలా ముఖ్యం. ఇన్నింగ్స్‌ను దశలవారీగా విభజించుకుని ముందుకు సాగాలని నేర్చుకున్నాను" అని తెలిపాడు. ప్రఖ్యాత ఇంటిపేరుతో వచ్చే ఒత్తిడి గురించి మాట్లాడుతూ.. ఆర్యవీర్ ఎంతో పరిణతితో సమాధానమిచ్చాడు. "నా ఇంటిపేరు, మా నాన్న సాధించిన విజయాల గురించి నేను ఎంతో గర్వపడతాను. ఆయన పేరు వల్ల నాపై ఎలాంటి ఒత్తిడి, భారం లేదు. ప్రశంసలు, విమర్శలను పట్టించుకోకుండా నా ఆటపై, నా ప్రక్రియపై మాత్రమే దృష్టి పెట్టేలా మైండ్‌సెట్ క్రియేట్ చేసుకుంటున్నాను. అదే నాకు మంచిది" అని స్పష్టం చేశాడు.

VARTHAA SAKSHAMU
RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
Editor : SAGINALA RAVI KUMAR
తెలుగు దిన పత్రిక
శుక్రవారం 25 సెప్టెంబర్ 2026

# నాని 'ప్యారడైజ్' ఓటీటీ పార్ట్‌నర్ ఫిక్స్.. స్ట్రీమింగ్ అప్పుడే!



నేచురల్ స్టార్ నాని తాజా చిత్రం 'ది ప్యారడైజ్' ప్రేక్షకుల ముందుకు వచ్చింది. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో రూపుదిద్దుకున్న ఈ రా యాక్షన్ డ్రామా కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూశారు. కాగా, ఈ చిత్రం డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులకు సంబంధించి కీలకమైన అప్‌డేట్ వచ్చింది. ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా డిజిటల్ హక్కులను సొంతం చేసుకుంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం, 'ప్యారడైజ్' డిజిటల్ రైట్స్ కోసం తీవ్రమైన పోటీ నడిచింది. చివరికి నెట్‌ఫ్లిక్స్ భారీ మొత్తానికి హక్కులను దక్కించుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఒప్పందం ప్రకారం, తెలుగుతో పాటు తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల స్ట్రీమింగ్ హక్కులు కూడా నెట్‌ఫ్లిక్స్ ఖాతాలోకే వెళ్లాయి. 'ప్యారడైజ్' చిత్రం సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల అయింది. సాధారణంగా పెద్ద సినిమాల మాదిరిగానే, థియేట్రికల్ రన్ ముగిసిన తర్వాతే ఇది ఓటీటీలో అందుబాటులోకి వస్తుంది. సినిమా విడుదలైన నాలుగు వారాల తర్వాత డిజిటల్ స్ట్రీమింగ్ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. దీన్నిబట్టి చూస్తే, దసరా పండుగ సందర్భంగా అక్టోబర్ 20–22 తేదీల మధ్య ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్‌లో ప్రసారం కావొచ్చని అంచనా వేస్తున్నారు. ఈ చిత్రంలో నానికి జోడీగా కయాదు లోహర్ హీరోయిన్‌గా నటించగా, కలెక్షన్ కింగ్ మోహన్ బాబు కీలకమైన విలన్ పాత్ర పోషించారు. ప్రముఖ నటి సోనాలి కులకర్ణి కూడా ఒక ముఖ్య పాత్ర పోషించారు.

# జీవితాంతం నీవు నా దగ్గరే ఉంటావు: విజయ్ దేవరకొండ

రియల్ లైఫ్ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న కలిసి నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి' సినీ అభిమానుల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ సినిమాలో విజయ్ దేవరకొండ 'సింగనమల బొబ్బిలి రణబాలి'గా పవర్‌ఫుల్ పాత్రలో అలరించనుండగా, ఆయనకు జోడీగా రష్మిక 'జయమ్మ' పాత్రలో నటిస్తోంది. ఇటీవల విడుదలైన 'ఏందయ్యా సామీ..' పాట యూట్యూబ్‌తో పాటు సోషల్ మీడియా వేదికగా విశేష ప్రజాదరణ పొందుతోంది. తాజాగా, ఈ పాటలోని ఒక రొమాంటిక్ క్లిప్‌ను రష్మిక తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ... అతను పూర్తిగా తనకే సొంతమయ్యాడని, కానీ అతనిపై ఉన్న క్రష్ మాత్రం ఏమాత్రం తగ్గలేదని కామెంట్ చేసింది. దీనికి విజయ్ దేవరకొండ రిప్లై ఇస్తూ... "నేను ఎంతో అదృష్టవంతుడిని. నేను జయమ్మని మిస్ అవుతాను కానీ.. జీవితాంతం నువ్వు నా దగ్గరే ఉంటావు" అని ఎంతో ప్రేమగా స్పందించాడు. ఈ సరదా సంభాషణ మరియు వారి మధ్య ఉన్న అనుబంధం చూసి అభిమానులు మురిసిపోతున్నారు. మరోవైపు, ఈ సినిమాకు రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వం వహిస్తుండగా... మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. దసరా కానుకగా అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.



# 'ది ప్యారడైజ్' ప్రభంజనం..

## విడుదలకు ముందే అమ్ముడయిన 15 లక్షల టికెట్లు!

- నాని, శ్రీకాంత్ ఓదెల కాంబోలో 'ది ప్యారడైజ్' విడుదల
- విడుదలకు ముందే అడ్వాన్స్ బుకింగ్స్ లో సంచలనం
- సుమారు 15 లక్షల టికెట్లు అమ్ముడైనట్లు వెల్లడి
- 'దసరా' విజయం తర్వాత వస్తుండటంతో భారీ అంచనాలు
- 'జడల్' అనే విభిన్న పాత్రలో నాని నటన పై ఆసక్తి




నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటించిన ప్రతిష్ఠాత్మక చిత్రం 'ది ప్యారడైజ్' ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి అడుగుపెట్టింది. అయితే, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహించిన ఈ సినిమా, విడుదలకు ముందే అడ్వాన్స్ బుకింగ్స్‌లో సరికొత్త రికార్డు సృష్టించింది. బుక్‌మైషో, బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ వంటి ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఏకంగా 15 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది.నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్ లో గతంలో వచ్చిన 'దసరా' చిత్రం ఘన విజయం సాధించడం తో 'ది ప్యారడైజ్'పై మొదటి నుంచీ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆ అంచనాలకు తగ్గట్టుగానే తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా ప్రీ-బుకింగ్స్ జోరుగా సాగాయి. నాని గత చిత్రాలతో పోలిస్తే ఇది చాలా పెద్ద సంఖ్య కావడం విశేషం. సినిమాపై ప్రేక్షకుల్లో ఉన్న ఆసక్తికి ఈ బుకింగ్సే నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఈ సినిమాలో 'జడల్' అనే విభిన్నమైన పాత్రలో నాని కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన ఆయన లుక్, ప్రచార చిత్రాలు సినిమాపై క్యూరియాసిటీని మరింత పెంచాయి. 'దసరా'కు పూర్తి భిన్నమైన ప్రపంచాన్ని ఈ చిత్రంలో చూపించబోతున్నట్లు దర్శకుడు చెప్పడంతో ఈ కొత్త కాంబో మరోసారి ఎలాంటి మ్యాజిక్ చేస్తుందోనని ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది.

# 'కల్కి 2898 ఏడీ'కి జాతీయ అవార్డులు.. ఆసక్తికర విషయాలు పంచుకున్న నాగ్ అశ్విన్



'కల్కి 2898 ఏడీ' సినిమాకు రెండు జాతీయ అవార్డులు రావడంపై దర్శకుడు నాగ్ అశ్విన్ ఆనందం వ్యక్తం చేశారు. భారీ స్థాయిలో ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టించడంతో పాటు.. దాన్ని ప్రేక్షకులకు భావోద్వేగంగా దగ్గర చేయగలిగామని అన్నారు. ప్రభాస్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రానికి 'బెస్ట్ ఫిల్మ్ ప్రొవైడింగ్ హోల్‌సమ్ ఎంటర్‌టైన్‌మెంట్', 'బెస్ట్ ప్రొడక్షన్ డిజైన్' విభాగాల్లో జాతీయ అవార్డులు దక్కాయి. దీనిపై నాగ్ అశ్విన్ మాట్లాడుతూ.. "ఇంత భారీ ప్రపంచాన్ని సృష్టించడం సాంకేతికంగా, నిర్వహణ పరంగా పెద్ద సవాలు. ఆ ప్రపంచాన్ని ప్రేక్షకులకు భావోద్వేగంగా చేరువ చేయగలిగాం. సినిమాతో కోట్లాది మంది కనెక్ట్ అయ్యారు. అందులోని ప్రపంచం, పాత్రలను ప్రేమించారు. ఈ రెండు

- 'కల్కి 2898 ఏడీ'కి రెండు జాతీయ అవార్డులు
- భారీ ప్రపంచాన్ని ప్రేక్షకులకు చేరువ చేశామన్న దర్శకుడు
- ప్రొడక్షన్ డిజైన్ అవార్డుపై ప్రత్యేకంగా స్పందన
- భారతీయ మూలాలతో కొత్త ప్రపంచాల సృష్టికి ప్రాధాన్యమిస్తామని వెల్లడి

విషయాలను సాధించగలగడం మాకు చాలా ప్రత్యేకం" అని తెలిపారు. 'కల్కి 2898 ఏడీ'కి దక్కిన ప్రొడక్షన్ డిజైన్ అవార్డుపై కూడా ఆయన స్పందించారు. ఇప్పటికే ఉన్న ప్రపంచాన్ని అనుకరించకుండా. సినిమాకు ప్రత్యేకమైన విజువల్ గుర్తింపు ఉండేలా ప్రయత్నించామని చెప్పారు. ఇకపై కూడా భారతీయ మూలాలతో కూడిన కొత్త తరహా ప్రపంచాలను సృష్టించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. నాగ్ అశ్విన్‌కు జాతీయ అవార్డు దక్కడం ఇదే తొలిసారి కాదు. కీర్తి సురేశ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'మహానటి' చిత్రానికి 2018లో ఉత్తమ చిత్రంగా జాతీయ అవార్డు వచ్చింది. ఇప్పుడు 'కల్కి 2898 ఏడీ'తో ఆయనకు మరో రెండు అవార్డులు దక్కాయి.

PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.